PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 29.06.2012, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 04 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## సెల్‌చల్

# 'కాల్' దుమ్వారు!





- దుమారం రేపుతున్న కాల్స్
- విచారణపై ఆద్యంతం అనుమానాలు
- జెడీ కాల్స్ సంగతేంటంటున్న వైకాపా
- దారితప్పుతున్న దర్యాప్తు



జగన్ అక్రమాస్తుల కేసు... దానిమీద సిబిఐ విచారణ... జెమినీ లో 'మొగలిరేకులు' సీరియల్ మాదిరిగా ఎన్నో మలుపులు తిరుగుతుంది. ఎన్నో ఎపిసోడ్‌లను తీసుకుంటుంది. మరెన్నో సంచలనాలను రేపుతుంది. 'జగన్-సిబిఐ' అనే రియల్ సీరియల్‌లో ఎవరి పాత్రలు ఏంటో, ఎవరు విలన్‌లో, ఎవరు హీరోలో, అసలు ఎవరి కోసం ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారో, ఎందు కోసం చేస్తున్నారో, చివరకు ఎవరు దోషులవుతారో, ఇంకెవరు నిర్దోషులుగా బయటకొస్తారో చెప్పలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యంగా సిబిఐ విచారణ దాని పంథాలో అది సాగిపోతే ఇన్ని మలుపులుండవు. కాని సిబిఐ విచారణలో ఒక వర్గం మీడియా పాత్ర ఎక్కువ కావడం, జగన్‌ను సిబిఐ జె.డి లక్ష్మీనారాయణ బదులు తామే విచారిస్తున్నట్లుగా ఒక టీవీ ఛానెల్ యాజమాన్యం వ్యవహరిస్తుండడంతో అసలు సిబిఐ దర్యాప్తు మీదే నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ముఖ్యంగా రామాయణంలో పిడకలవేట మాదిరిగా జగన్ అక్రమాస్తులకేసు, సిబిఐ విచారణ వర్గంలో సిబిఐ జాయింట్ డైరక్టర్ లక్ష్మీనారాయణ సెల్‌ఫోన్ కాల్ లిస్టు ఇప్పుడు పెద్ద దుమారాన్ని రేపింది.

(మిగతా 10వ పేజీలో)

# మారిస్తేనే మార్పు!

- కాంగ్రెస్‌లో పెరుగుతున్న ఆందోళన
- మళ్లీ అధికారం రాదని నేతల ఆవేదన




అధికార కాంగ్రెస్‌పార్టీ ప్రజలలో తన ఉనికిని కోల్పోయిందనే విషయాన్ని అద్దంలో ముఖం చూసుకున్నట్లుగా రాష్ట్రంలో జరిగిన ఉపఎన్నికలు తేటతెల్లం చేశాయి. తప్పు చేయటం, దాన్ని సరిదిద్దుకునేందుకు మరో తప్పుచేయటం... ఇది కాంగ్రెస్ సంస్కృతి. అంటే అలనాటి జాతీయ కాంగ్రెస్‌ది కాదు. నేటి సోనియాగాంధీ కాంగ్రెస్‌ది. రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమి పాలయ్యే దానికి మూలాలు వెదకాల్సిన అధిష్టానం, ఆ పనిని ప్రక్కనపెట్టి నివేదికలు చర్చలతో టగ్‌ఆఫ్ వార్ (చాంతాడు ఆట) ఆడిస్తూ కాలక్షేపం చేస్తుంది.

జగన్‌ను సాధించి జైలులో పెట్టి ఆయన నిర్మించిన పార్టీతో పాటు జగన్ రాజకీయ భవిష్యత్తును భూస్థాపితం చేసేందుకు కాంగ్రెస్ నాయకత్వం కంకణం కట్టుకొని వుందన్న వాస్తవాన్ని వైయస్సార్ దివంగతుడైన కొద్దిమాసాలలోనే ప్రజలు అవగతం చేసుకున్నారు. గడచిన ఏడాదిన్నరలో కాంగ్రెస్ పాలకులు జగన్‌ను వేధించి జైలుకు పంపినదాకా జరిగిన సంఘటనలకు స్పందించారు. అందుకే వైయస్సార్సీని ఆదరించారు. కాంగ్రెస్‌కు, దిమ్మతిరిగేలా తీర్పు ఇచ్చారు. కాంగ్రెస్‌పార్టీకి పోలైన ఓట్లతో, వైయస్సార్సీకి పడ్డ ఓట్ల మొత్తంను బేరీజువేసుకున్న కాంగ్రెస్ అధిష్టానం గుండెలు జారాయి.

(మిగతా 10వ పేజీలో)





# సేవలు సశేషం!

## నారాయణాద్రిని వదలని శేషాద్రి

ఏడుకొండల వెంకన్న సన్నిధిలో ఒక ఏదాది సేవ చేసుకునే భాగ్యం కలిగితే చాలని చాలామంది కోరుకుంటుంటారు. వెంకన్న సన్నిధిలో వుండే అవకాశమొస్తే పేరుమోసిన పారిశ్రామికవేత్తలు సైతం తమ పనులను వదిలేసి ఆ దేవదేవుడి వద్దకు పరుగులు తీస్తారు. కాని ఒక వ్యక్తికి జీవితాంతం అలాంటి అవకాశం వస్తే... ఇక ఆ జన్మకు అంతకంటే కావాల్సింది ఏముంది.

ఏ జన్మలో చేసుకున్న పుణ్యఫలమోగాని డాలర్ శేషాద్రికి పదవీకాలం ముగిసినా శ్రీవారి సన్నిధిలో ఆయనకు సేవాభాగ్యం కలుగుతూనే వుంది. ఏ పాలకమండలి వచ్చినా ఆయనను కొనసాగిస్తూ తీర్మానాలు చేయడం ఆశ్చర్యం కలిగించే విషయం. వెంకటాద్రిని శేషాద్రి వదిలిపోలేకున్నాడో, శేషాద్రిని ఆ వెంకటాద్రి వదులుకోలేకున్నాడో అంతుబట్టడంలేదు. డాలర్‌శేషాద్రి మీద గతకొన్నేళ్లుగా ఎన్నో ఆరోపణలున్నాయి. డాలర్ల కుంభకోణం మొదలుకొని, శ్రీవారి సేవలకంటే తిరుమలకు వచ్చే విఐపి భక్తుల సేవలోనే ఆయన ఎక్కువగా తరిస్తుంటాడనే ఆరోపణలున్నాయి.

అయితే పరమతి, పలుకుబడి వంటి శ్రీవారి సన్నిధిలోనైనా కాని పనంటూ వుండదని శేషాద్రి నిరూపించాడు. వెంకటేశ్వరస్వామికి ఎంత

(మిగతా 12వ పేజీలో)



PDF Compressor Free Version



# నెల్లూరు కబుర్లు

## స్టేషన్‌కో సిఐ

నెల్లూరు నగరంలోని ఆరు పోలీస్‌స్టేషన్‌లకు ఆరుగురు సిఐలు రాబోతున్నారు. ఈమేరకు జిల్లా ఎస్పీ బి.వి.రమణ కుమార్ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం నగరానికి నార్త్, సౌత్ సిఐలు వున్నారు. మహిళాస్టేషన్‌కు ప్రత్యేక సిఐ వున్నారు. అయితే నగరంలో జనాభా 7లక్షలు దాటడం, పోలీస్‌స్టేషన్‌ల పరధిలలో కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి స్టేషన్‌కు ఒక సిఐను నియ మించేలా ఎస్పీ చొరవచూపుతున్నారు.

## డాక్టర్ వైసంజీవరావు వర్ధంతి



ఉత్తమ ఇఎన్‌టి వైద్య నిపుణులు కీర్తిశేషులు డాక్టర్ వై.సంజీవరావు తృతీయవర్ధంతిని నెల్లూరు పొగ తోటలోని వైద్య శాలలో జరి పారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి హైదరాబాద్‌కు చెందిన వైద్యులు ఎం.ఆదినారాయణరెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వి.హజరత్‌బాబు మొదలగు వారు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం రక్తదానం శిబిరం నిర్వహించారు. పెద్దాసుపత్రి రక్తనిధి ఇన్‌చార్జి డాక్టర్ బి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 50యూనిట్ల రక్తాన్ని సేకరిం చారు. రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

## వడ్డీ వ్యాపారులకు పండగ

మద్యం టెండర్ల పుణ్యమా అని నెల్లూరు, జిల్లాలోని ఇతర పట్టణాలలో వడ్డీ వ్యాపారులకు పండగే అయ్యింది. సాధార ణంగా ప్రైవేట్ వడ్డీ వ్యాపారం వందకు 2రూపాయల నుండి 5రూపాయల వరకు అవసరాన్నిబట్టి జరుగుతుంటుంది. కాని మద్యం టెండర్ల పుణ్యమా అని వందకు పది, పదిహేను రూపాయలదాకా వడ్డీ పెరిగినట్లు తెలుస్తుంది. మద్యం వ్యాపారులు ఒక్కొక్కరు 10 నుండి పాతిక, యాభై దరఖాస్తుల వరకు వేసివున్నారు. కనీసం 10దరఖాస్తులు వేయాలన్నా ఇఎండికి కనీసం 60లక్షలు దాకా కావాలి. లక్కీడిప్‌లో షాపులు తగలకపోతే ఇఎండి వెనక్కి వచ్చేస్తుంది. కాబట్టి అప్పటికప్పుడు పది, పదిహేను రూపాయల వడ్డీలకు మద్యం వ్యాపారులు అప్పులు తెచ్చి దరఖాస్తులు వేసారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం



కలెక్టర్‌కు విరాళాన్నందజేస్తున్న రాధాకృష్ణమూర్తి

నెల్లూరు, దర్గామిట్టలోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి విశ్రాంత వ్యవసాయ అధికారి శాఖమూరి రాధా కృష్ణమూర్తి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ నెల 22న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌ను కలిసి ఆయన ఈ విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ బి.రామిరెడ్డి, రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి కన్వీనర్ తుంగా శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, ఎం.జి.బ్రదర్స్ అధినేత ఎం.ఆర్.గంగాధర్‌లు కూడా పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని నూతన కార్యవర్గం

నెల్లూరు నగరం, దర్గామిట్ట వద్దగల స్వర్ణవేదిక కల్యాణ మండపంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని నూతనకార్యవర్గ ప్రమాణ స్వీకారం 24వతేదీన జరిగింది. లయన్స్ క్లబ్ మాజీ మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ జె.జగన్మోహనరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతనకార్యవర్గంచే ప్రమాణంస్వీకారం చేయించారు. అధ్యక్షునిగా చెవుల యుగంధర్‌తో పాటు బి.పార్థసారధి, డి.వి.శరత్‌బాబు, జి.హరికృష్ణ, కె.ప్రదీప్, డి.సునీల్‌బాబు, టి.వెంకటేశ్వర్లు, ఆర్వీ శరత్‌చంద్ర, ఆర్.పాండురంగారావు, పి.జగన్నాథంలు ప్రమాణస్వీకారం చేశారు.

ఈ కార్యక్రమ నిర్వాహకులుగా జిల్లా వైస్‌గవర్నర్ అమృతవల్లి, తులసి చంద్రశేఖర్, బి.వి.రవికుమార్, బి.పార్థ సారధి, డి.సునీల్‌బాబులు వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో 61మంది నూతనంగా క్లబ్ సభ్య త్వాన్ని స్వీకరించారు. అనంతరం నెల్లూరు హరివిల్లు క్రియే షన్స్ ఆధ్వర్యంలో దోర్నాదుల హరిబాబు బృందం నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమం నవ్వుల హరివిల్లు ఆహూతులను ఆనందపరిచింది.

## నారాయణలో క్యాంపస్ సెలక్షన్స్

నెల్లూరు నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళా శాలలో సెట్రైల్‌సంస్థ జూన్ 24వ తేదీన క్యాంపస్ సెలక్షన్స్ జరిపింది. 12మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంపి కయ్యారు. సెలెక్షన్స్‌లో సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్‌లు హర్ష వర్ధన్, గురు, ప్రిన్సిపాల్ డా॥జి.జగదీశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిక్కిరిసిన బ్యాంకులు

మద్యం దరఖాస్తులకు సోమవారం ఆఖరిరోజు కావడంతో నగరంలోని అన్ని బ్యాంకులు యమరద్దీగా కనిపించాయి. మద్యం దర ఖాస్తుతో పాటు డి.డిలు జతచేయాల్సి వుండడం, సోమవారం ఆఖరిరోజు కావడంతో దరఖాస్తుదారు లతో ప్రధాన బ్యాంకు కార్యాలయాలు కిటకిట లాడాయి. రోజువారీ లావా దేవీలు జరిపేవారు వీరి మూలంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

## సేవాసంస్థ వితరణ

నెల్లూరు మనుమసిద్ధి నగర్‌లోని అత్తివరపు మోహనమ్మ మెమోరియల్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈనెల 23న విద్యార్థులకు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సేవాసంస్థ నోటుపుస్త కాలు, పెన్నులు, పెన్సిల్స్, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేసింది. సంస్థ అధ్యక్షులు వి.బాలకృష్ణాచారి, కోశాధి కారి కె.వి.శేషాచారి, గౌర వాధ్యక్షులు కె.మోహనా చారి, ఉపాధ్యక్షులు సుబ్ర హ్మణ్యం, పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఇ.గోవిందు ఈ కార్యక్రమంలో పాల్గొ న్నారు. 260మంది విద్యా ర్థులకు వీటిని పంపిణీ చేయగా వారు ఆనందం వ్యక్తం చేశారు.

## మద్యంపై నియంత్రణ కావాలి



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న తెలుగుదేశం నాయకులు

మద్యం అమ్మకాలను నియంత్రించాలని కోరుతూ సోమ వారం నెల్లూరుజిల్లా తెలుగుదేశం నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి బి.రామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మద్యం అమ్మకాల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, మద్యాన్ని ఆదాయ వనరుగా చూడకుండా సాంఘిక దురాచారంగా చూడాలని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు బీద రవిచంద్రతో పాటు తెలుగుదేశం నాయకులు రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యే పరసా రత్నం, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్, కీలారి వెంకటస్వామినాయుడు, గూటూరు కన్న బాబు, అన్నం దయాకర్‌గౌడ్, చిరమన శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యంషాపులకు బినామీ పేర్లతో టెండర్లువేసిన నాయ కులు కూడా ఈ వినతిపత్రం అందించే కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

## పాప దత్తత



కుట్టి పాపను అందిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

నెల్లూరులోని స్త్రీ శిశుసంక్షేమశాఖ వారి శిశుగృహంలో వున్న కుట్టి అనే 8నెలల పాపను సూళ్లూరుపేటకు చెందిన మహేష్‌కుమార్, సబిత అనే పిల్లలు లేని దంపతులు దత్తతకు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ తన చేతులమీదుగా పాపను వారికిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఏపిడి విజయలక్ష్మి, శిశుగృహ మేనేజర్ రమాదేవి పాల్గొన్నారు.

## దోపిడీ దొంగలు దొరికారు

> అవసరం ఏమైనా చేయిస్తుంది. అయితే చెడు వ్యసనాలకు అలవాటుపడినవారు. ఆ అవసరాలు తీర్చుకొనేందుకు దొంగతనాలు, దాదులు, దోపిడీలు సులభమార్గంగా ఎంచుకుంటున్నారు.

నెల్లూరు నగరంలో రాత్రి -పగలు అనే తేడా లేకుండా నడిరోడ్డుపై జరుగుతున్న దోపి డీలకు అంతే లేకుండా పోయింది. వీరు ఎన్నుకొనే మార్గాలు చీకటి ప్రాంతాలు, నిర్జనప్రాంతాలే కాకుండా జనసమ్మర్థం గల ప్రాంతాలు కూడా వున్నాయి. మెడలో చైన్ లాక్కొని పారిపోవాలంటే జనంలోనే సాధ్యమనేది వీరి ఆలోచనలాగుంది. ఈ క్రమంలో నెల్లూరు సిసియస్ పోలీసులు రోడ్డు దోపిడీదారులను ముగ్గురిని అదుపులోకి తీసుకొని నేరం రుజువుకావటంతో అరెస్టుచేశారు. ఈ సందర్భంగా సిసియస్ సిఐ పి.వీరాంజనేయరెడ్డి వీరిని గురించి ఇలా వివరిస్తున్నారు.

నెల్లూరు నగరంలో జూన్ 24వ తేదీ రోడ్డుపై బాటసారు లను అడ్డగించి దోపిడీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేశాం. వీరు ఖుద్దూస్‌నగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌బాషా, షేక్ సబీర్ అలియాస్ ఆటో మున్నా, షేక్ సమీద్‌లు. నగరంలోని సుబేదారు పేట రైల్వేట్రాక్ సమీపంలో ప్రయాణించే వారిని బెదిరించి, కొట్టి నగదు, సెల్‌ఫోన్స్, బంగారు ఆభరణాలు దోచుకొని పోతుంటారు. దీనికి కారణం ఈ ముగ్గురూ చెడువ్యసనాలకు బానిసలు కావటమే. కష్టపడి సంపాదించుకునే మొత్తం వీరి అవసరాలు తీర్చకపోవటంతో అడ్డదోవత్రొక్కి దోపిడీలు మొదలుపెట్టారన్నారు సిఐ వీరాంజ నేయరెడ్డి. వీరిని పట్టుకొనేందుకు కృషిచేసిన సిసియస్ ఎస్.ఐ జగత్‌సింగ్, మూడవ నగర పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ నాగేశ్వరరావు, సిసియస్ పోలీసులు రమేష్, గిరిధర్, సుధాకర్‌సింగ్, శిఖామణి, మస్తాన్, వెంకటేశ్వర్లు, ప్రసాద్‌లను ఎస్పీ బి.వి.రమణకుమార్ అభినందించి రివార్డు ప్రకటించారు.

నగరంలో చాలా ప్రాంతాలలో 7గంటల తర్వాత జనం తిరగగలిగే పరిస్థితి లేకుండాపోయింది. దొంగలు, దోపిడీ గాండ్లతో పాటు అల్లరిమూకలు మోటర్‌సైకిళ్లను రోడ్డు కూడలిలో అడ్డంగా నిలిపి పాదచారులకు చాలా ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ విషయంలో పోలీసు అధికారులు శ్రద్ధ తీసుకుంటే, కనీసం యాభైశాతం మందైనా క్రమమార్గంలోకి వచ్చే అవకాశం ఉంది. పోలీసులూ కొంచెం నిఘా పెట్టండి.

## అర్ధరాత్రి కోతలతో అవస్థలు



**అధికారులు ప్రకటించిన సమయానికి, విద్యుత్‌కోత విధిస్తున్న గంటలకు పొంతనలేకుండా పోయింది. అర్ధరాత్రి, అపరాత్రి మిట్ట మధ్యాహ్నం అనే భేదంలేకుండా గంటల తరబడి విద్యుత్‌కోత నెల్లూరు నగరవాసుల్ని తీవ్ర ఇబ్బందులకు లోనుచేస్తుంది.**

రెండుగంటలు అధికారికంగా విద్యుత్ కోత వుంటుందని ప్రకటించిన అధికారులు ఏకంగా 7గంటల పాటు విద్యుత్ తీసివేస్తున్నారు. అదీ వేళాపాళా లేకుండా. కొన్ని ప్రాంతాలలో 10గంటల పాటు కూడా ఈ వారంలో కోత విధించిన సందర్భాలున్నాయి. ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ క్రింద ఉన్నతాధికారులు కోతలు అమలు చేస్తున్నారని, జిల్లాలో తాము ప్రకటించిన కోత సమయాలకు భిన్నంగా హైదరాబాద్ వారు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని, కోత తప్పదని, ఎన్ని గంటలు విద్యుత్ ఉండదో నికరంగా స్పష్టంగా తెల్పి చెప్పలేమని మా చేతుల్లో ఏమీలేదని, చేతులెత్తేశారు నెల్లూరునగర ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ జగన్మోహనరెడ్డి.

ఇలా చెప్పేదానికి మీరెందుకు కోతల సమయాన్ని అధికారికంగా ప్రకటిస్తున్నారంటూ జూన్ 24వ తేదీన నెల్లూరులోని మిలీనియం స్టేషన్‌ను ఆ ప్రాంతవాసులు అర్ధరాత్రి చుట్టు ముట్టారు. అధికారులకు, ప్రజలకు మధ్య పెద్ద గొడవే జరిగింది. పరిస్థితి చేయిదాటడంతో ఆరవ నగరపోలీసులు రంగప్రవేశం చేసి సర్దుబాటు చేశారు. అడ్డగోలుగా విద్యుత్‌కోతలు జరుగుతుంటే మధ్యలో ఎగిరెగిరిపడ్తూ నగరంలోని విద్యుత్ అధికారులు ఈ సమయం నుంచి ఈ సమయం వరకూ మొత్తం 4గంటలు మాత్రమే విద్యుత్‌కోత ఉంటుందని అధికారిక ప్రకటనచేయటం ఎందుకు? అడిగితే తమ చేతుల్లో లేదు స్విచ్ హైదరాబాద్‌లో ఉందంటారా? ఇదేమి చోద్యం బాబూ, కనీసం నిద్రపోయే సమయంలోనైనా కోతలు లేకుండా చూడండి. లేకుంటే ఇక అర్ధరాత్రి ఉద్యమాలు తప్పవు. తస్మాత్ జాగ్రత్త. ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయం పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. జనరేటర్లు, ఇన్‌వెర్టర్లు పెట్టుకొంటే సామాన్య ప్రజల బాధలు అర్థంకావు. బాబ్బాబు కొంచం ఆలోచించండయ్యా?

PDF Compressor Free Version



• ఓటమి ఎఫెక్ట్

# 'దేశం'లో మొదలైన రగడ



ఉపఎన్నికలు ముగియగానే టీడీపీలో వున్న విభేదాలు మళ్లీ తెరకెక్కాయి.

**జిల్లా తెలుగుదేశంపార్టీలో నాయకుల మధ్యవున్న విభేదాలు ఉపఎన్నికల అనంతరం కూడా కొనసాగుతున్నాయి. టీవీ ప్రోగ్రామ్‌లలో యాంకర్ 'స్మాల్ బ్రేక్' అన్నట్లుగా ఈ ఉపఎన్నికల ద్వారా తెలుగుతమ్ముళ్ల రియల్‌ఫైట్‌షోకు చిన్నబ్రేక్ వచ్చిందంతే!**

ఉపఎన్నికలకు ముందు తెలుగుదేశం నాయకుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు వుండడం తెలిసిందే! ముఖ్యంగా జిల్లా పార్టీ అధ్యక్షులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వంటేరు వేణుగోపాలరెడ్డి మధ్య భేదాభిప్రాయాలు వున్నాయి. నెల్లూరు లోక్‌సభ స్థానానికి వంటేరు వేణుగోపాలరెడ్డి పేరును సోమిరెడ్డి బలంగా ప్రతిపాదించడం జరిగింది. అయితే ఇది చేసింది వంటేరు మీదున్న అభిమానంతో కాదు. ఎలాగూ నెల్లూరులో తెలుగుదేశం గెలిచే పరిస్థితి లేదు కాబట్టి వంటేరును ప్రతిపాదించాడు.

అనుకున్నట్లే ఉపఎన్నికల పర్వం మొదలయ్యాక సోమిరెడ్డి - వంటేరుల మధ్య లుకలుకలు బయటపడ్డాయి. ముఖ్యంగా ఎన్నికల ఖర్చు వ్యవహారాలలో ఇద్దరి మధ్య విభేదాలొచ్చి, విషయం చంద్రబాబు దాకా వెళ్లింది. ఒక దశలో పోటీ నుండి వంటేరు తప్పుకుంటారనే ఊహాగానాలు సైతం వచ్చాయి.

ఉపఎన్నికలకు ముందు సీన్ ఇలా వుంటే, ఉపఎన్నికలలో వంటేరుకు వచ్చిన ఓట్లు తెలుగుదేశం నాయకుల మధ్య మరింత పొగను రాజేసాయి. ముఖ్యంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో పాటు బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్ర, గూటూరు కన్నబాబు, రమేష్‌రెడ్డి,

(మిగతా 10వ పేజీలో)

• పున:నిర్మాణం జరిగేనా?

# గత వైభవం సాధ్యమేనా?

ఉపఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ నేతలు భవిష్యత్‌పై తీవ్రంగా దృష్టి సారించారు.



**స్లాబు పెచ్చులూడితేనో, గోడకు పగుళ్లిస్తేనో ఒక భవనానికి మరమ్మతులు సులభంగా చేయవచ్చు. కాని పిల్లర్స్‌తో సహా స్లాబు కూలిపోతే, ఆ భవనాన్ని తిరిగి నిర్మించడం ఎంత కష్టమో, ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్‌పార్టీని మునుపటిలా నిలబెట్టడం అంత కష్టమే!**

రాష్ట్రంలో జగన్ హవా నడుస్తుంది. ఆ పార్టీ అభ్యర్థులు గెలుస్తారు. తమ పార్టీ ఓడిపోవడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు అనుకున్నారుగాని, మరీ ఇంత చిత్తుగా ఓడిపోతుందని కలలోకూడా అనుకుని వుండరు. ఈ ఉపఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్‌కు వచ్చిన భారీ మెజార్టీల షాక్ నుండి జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఆ మెజార్టీలు చూసి రాజకీయాలను వదిలి పారిపోవాలనుకున్న తమ అనుచరులకు, కార్యకర్తలు ఆ పార్టీ నాయకులు... రాజకీయాలలో అప్ అండ్ డౌన్‌లు కామనేనని, ఎల్లకాలం కష్టాలు వుండవని హితబోధ చేస్తూ వారిని పార్టీలో నిలబెట్టే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు.

ముఖ్యంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తన నియోజకవర్గంలో పునరేకీకరణ చర్యలు మొదలుపెట్టారు. పార్టీ మున్ముందు ఇంకా దెబ్బతినకుండా దిద్దుబాటు చర్యలు చేపట్టారు. నెల్లూరు నగరంతోపాటు, రూరల్, ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాలలో పార్టీ పునాదులు కదిలిపోయాయి. ఎటువంటి ఎన్నికలు జరక్కపోయినా జిల్లాలోని మిగతా నియోజకవర్గాలైన సర్వేపల్లి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట సెగ్మెంట్లలో పార్టీ పరిస్థితి మెరుగ్గా వుండే అవకాశాలు

(మిగతా 10వ పేజీలో)



# పెరిగిన మెజార్టీతో తగ్గుతున్న ప్రయార్టీ

పిల్లికి చెలగాటం... ఎలుకకు ప్రాణసంకటం... అన్న సామెతలా నిన్నటి ఉపఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వచ్చిన భారీమెజార్టీలు ఆ పార్టీలోని కొందరు నాయకుల భవిష్యత్ రాజకీయాలకు ఆటంకంగా మారనున్నాయి. ముఖ్యంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముందు ఈ మెజార్టీలు పెద్ద సమస్యలే తెచ్చిపెట్టబోతున్నాయి. మూడునెలల క్రితం జరిగిన కోవూరు ఉపఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన 23వేల చిల్లర ఓట్ల మెజార్టీతో గెలిచాడు. వాస్తవంగా వైయస్సార్ కాంగ్రెస్ శ్రేణులైతే 30వేలకుపైగా మెజార్టీని ఆశించారు. ఈమేరకు వందలకోట్ల రూపాయల్లో పందేలు కాసారు కూడా! అయితే ప్రసన్న మెజార్టీ పాతిక వేలను కూడా దాటలేదు. స్థానికంగా ప్రసన్న పట్ల వున్న వ్యతిరేకత వల్లే మెజార్టీ తగ్గిందని ఆనాడే వైకాపా నేతలు అభిప్రాయపడ్డారు.

వారి అభిప్రాయానికి నిన్నటి ఉపఎన్నికల ఫలితాలు మరింత ఊతమిచ్చేలా వున్నాయి. నిన్న ఉపఎన్నికలలో కోవూరు సెగ్మెంట్‌లోనే అత్యధికంగా 53వేల ఓట్ల మెజార్టీ వచ్చింది. అంటే ప్రసన్నకంటే కూడా 30వేల ఓట్లు పెరిగాయి. మొన్న ప్రసన్న పోటీ చేసినప్పుడు ఇందుకూరుపేట మండలంలో మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ వెనుకబడింది. కాని ఈ ఎన్నికలలో చూస్తే కాంగ్రెస్ అభ్యర్థి టిపిస్సార్ సొంత ప్రాంతమైన ఆ మండలంలోనూ 11వేల మెజార్టీ వచ్చింది. దీనినిబట్టి ప్రసన్న మీద వ్యతిరేకత వల్లే కోవూరు ఉపఎన్నికలప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌కు మెజార్టీ బాగా తగ్గిందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

# అప్పుడు ఓడారు... ఇప్పుడు గెలిచారు!



కోవూరు ఉపఎన్నికలప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలిచింది. కాని ఆ పార్టీ మీద పందేలు కాసినవాళ్లు మాత్రం ఓడిపోవడం జరిగింది. కారణం మెజార్టీలో తేడాలే! వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి పాతికవేలకుపైగా మెజార్టీ వస్తుందనే దాని మీద అప్పట్లో వందల కోట్లలో పందేలు జరిగాయి. కొందరు 30వేల మెజార్టీల మీద కూడా పందేలు కాసారు. అయితే పాతికవేలకు పైగా మెజార్టీ వస్తుందని పందేలు కాసినవాళ్లు తీవ్రంగా నష్టపోయారు. ఆరోజు ప్రసన్న మెజార్టీ మరో 1500 దాటివుంటే చాలామంది రాతలు మారివుండేవి.

కాని ఈ ఉపఎన్నికలలో మాత్రం జగన్‌పార్టీని నమ్ముకున్న వాళ్లు నష్టపోలేదు. మొత్తం 18అసెంబ్లీలకు గాను జగన్ పార్టీకి 15స్థానాలు వస్తాయి, రావు అనే అంశం మీదే వందలకోట్ల రూపాయల పందేలు జరిగాయి. అయితే నెల్లూరు లోక్‌సభలో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి మెజార్టీ 2లక్షలు దాటుతుందనేదాని మీద కూడా ఎక్కువగా పందేలు కాసారు. ఈసారి వైయస్సార్ కాంగ్రెస్‌వాళ్లే కాదు, కొందరు కాంగ్రెస్ నాయకులు సైతం వైయస్సార్ కాంగ్రెస్ మీద నమ్మకంతో ఆ పార్టీకి వచ్చే స్థానాలు, మెజార్టీల మీద పందేలు కాసి కోట్లు గడించడం విశేషం.

## పోరు ముగిసింది

# పాలన మొదలైంది



ఉపఎన్నికల పోరులో 52రోజుల పాటు సెలవులు లేకుండా అధికార యంత్రాంగమంతా విధులు నిర్వహించారు. ఎన్నికల హడావిడి ముగిసింది. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా కౌంటింగ్ కూడా పూర్తికావటంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటివరకూ పెండింగ్‌లో వున్న జిల్లా పరిపాలనపై 16వ తేదీ నుండి అధికారులు దృష్టి కేంద్రీకరించారు. 18వ తేదీ సాయంత్రంతో ఎన్నికల కోడ్ ముగిసింది. 19వ తేదీ నుండి పరిపాలనాపరమైన వ్యవహారాలు జిల్లాలో చురుగ్గా సాగుతున్నాయి. మేకపాటి సోదరుల రాజీనామాలతో జిల్లాలో ఉపఎన్నికలు రావటం జరిగింది. జిల్లా యంత్రాంగమంతా అనివార్యంగా ఎన్నికలను నిర్వహించాల్సి వుంది. పరిపాలనా వ్యవస్థ అంతా అతలాకుతలమైంది. ఇప్పటివరకూ కనీవినీ ఎరుగనిరీతిలో ఎన్నికల విషయంలో జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఎక్కడా, ఏ రాజకీయ పార్టీకి, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ తన టీమ్‌వర్క్‌తో జిల్లాలో ఎన్నికల ఘట్టంను సమర్థవంతంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్ ఒక ప్రక్క సాధారణ పౌరరక్షణ వ్యవహారాలు చక్కబరుచుకుంటూనే

(మిగతా 10వ పేజీలో)




# శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవ ఆహ్వానము

నెల్లూరు శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో సాయిబాబా **గురుపూర్ణిమ మహోత్సవాలు**

**తేది.03-07-2012 మంగళవారము నుండి తేది. 12-07-2012 గురువారము వరకు జరుగును.**

ప్రతి రోజూ ఉదయం 7-30గం.ల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు జరుగును. పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద 75రూ/- చెల్లించవలసినదిగా మనవి. గమనిక - పై దినములలో ప్రతిరోజూ షిర్డి హారతులు జరుగును.

**సాంస్కృతిక కార్యక్రమములు:** తేది.03-07-2012 మంగళవారం నుండి 12-07-2012 గురువారం వరకు ప్రతిరోజు సా॥6.30 గంటలకు కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవములలో వ్యాఖ్యాతలు డా॥ మేడసాని మోహన్‌చే శ్రీ కృష్ణ కథామృతం ఉపన్యాస మహాయజ్ఞము జరుగును.

**నగరోత్సవం:** తేది.09-07-2012 సోమవారం సా॥6.00గం.లకు మేళతాళాలు, విశేష పుష్పాలంకరణ, బాణాసంచా వేడుకలతో శ్రీ బాబావారి నగరోత్సవం అతి వైభవంగా జరుగును.

అన్నదానం : తేది.12-07-2012 గురువారం మధ్యాహ్నం 11.00గం.ల నుండి భక్తులకు అన్నదానం జరుగును.

కార్యవర్గము **శ్రీ షిర్డి సాయిబాబా మందిరం** గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771

PDF Compressor Free Version






## కలియుగ కర్ణులు

అలనాటి కర్ణుడు తనకు ప్రాణ ప్రదమైన కవచకుండలాలను దానం చేసాడు. ఇప్పుడు దానం చేసే కర్ణులు లేరు. దానం చేయమని సలహాఇచ్చే కర్ణులు! తెలుగుదేశం అధినేత, కుమ్మక్కు ప్రతిపక్షనేత జగన్ సొమ్మును పేదలకు పంచమని ఉచిత సలహా ఇచ్చాడు. రెండెకరాల ఆసామి వేలకోట్లు గడించిన అవినీతి సొమ్మును పేదలకు పంచి ఇతరులకు మార్గదర్శకం కావాలి బాబు. ఇంకొక కర్ణుడు మోత్కుపల్లి. ఇడుపులపాయలో భూములన్నింటిని పేదలకు పంచమని విశాల హృదయంతో ఉచిత సలహాఇచ్చారు. తమ నాయకుడు చంద్రబాబుకు చెప్పాలి ఆయన అక్రమాస్తులను పేదలకు పంచమని.

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## జె.డి చేసింది కరెక్టా?

సిబిఐ విచారణ సమాచారమంతా ఒక పత్రికకు, ఛానెల్‌కు చేరుతుందంటే దాని వెనుక ఎవరి హస్తముందనుకోవాలి. టీవీ ఛానెల్స్ క్రైం రిపోర్టర్లు జె.డికి ఫోన్‌చేసి వివరాలడగడంలో తప్పులేదు. కాని స్వయంగా ఆయనే క్రైం రిపోర్టర్లకు ఫోన్‌లు చేయాల్సిన అవసరమేంటి? ఆయన సిబిఐ జాయింట్ డైరక్టరేగా సిబిఐ పిఆర్‌ఓ కాదుకదా!

పి.నాగిరెడ్డి, సిద్ధవరం.

## మీడియా రోత

ఖచ్చితమైన సమాచారం చూద్దామనుకుంటే ఒక్క ఛానెల్ కూడా సరైంది లేదు. ప్రతి వార్తా ఛానెల్, ప్రతి వార్తాపత్రిక ఏదో ఒక రాజకీయపార్టీ ఆస్థాన ఛానెల్‌గా, పత్రికగా వుంటున్నాయి. ముఖ్యంగా ఎన్నో అక్రమాలతో మీడియాలోకి ప్రవేశించిన వ్యక్తులు సైతం పెద్ద మనుషులు ముసుగులు తగిలించుకుని నీతిబోధలు చేస్తుండడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా వుంది. ఒకే వార్తను ఒక్కో ఛానెల్ ఒక్కో విధంగా చూపిస్తుండేసరికి... ఏ వార్తను నమ్మాలో, ఏ వార్తను అబద్ధమనుకోవాలో తెలియని అయోమయస్థితికి లోనవుతున్నారు టీవీ వీక్షకులు. నిజమైన వార్తా విశ్లేషణే లేకుండా పోయింది.

ఓ.వి.రామ్మోహన్, నెల్లూరు.

## 'ప్రభా'తం

రాజకీయాలలో స్నేహంగాని, శత్రుత్వం గానీ ఏదీ శాశ్వతం కాదు. ఈరోజు శత్రువులుగా వున్నోళ్లు రేపు మిత్రులు కావచ్చు. నిన్న మిత్రులుగా వున్నవాళ్లు ఈరోజు శత్రువులైపోవచ్చు. అవసరాన్నిబట్టి రాజకీయాలలో స్నేహాలు మారుతుంటాయి. శత్రుత్వాలు తయారవుతుంటాయి.

రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో జాతీయ రాజకీయాలలో సరికొత్త సమీకరణాలు చోటుచేసుకుంటుండడం చూస్తున్నాం. 2014లో రాహుల్‌ను ప్రధానిని చేయాలన్న బలమైన కాంక్షవున్న సోనియాగాంధీ, తన బిడ్డ ప్రధాని కావడానికి ప్రధాన అడ్డం అవుతాడనుకున్న ప్రణబ్ ముఖర్జీని యుపిఏ కూటమి తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడం తెలిసిందే! రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక విషయంలో తమను సంప్రదించకుండానే యుపిఏ ఏకపక్షంగా వ్యవహరించిందని, కాబట్టి తాము బలమైన అభ్యర్థిని దించాలని ఎన్డీఏ ప్రయత్నించింది. ఈమేరకు మాజీరాష్ట్రపతి అబ్దుల్‌కలాంను బరిలోకి దించాలని తుదికంటా ప్రయత్నించింది. ఏకపక్షంగా ఎన్నుకునేటట్లయితే కలాం సుముఖత వ్యక్తం చేసేవారు. కాని పోటీ పడితే ఓడిపోయే అవకాశం వుందన్న ప్రమాదం పసిగట్టిన ఆయన హుందాగా ఎన్డీఏ అభ్యర్థనను తిరస్కరించారు. రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక విషయంలో మొదట తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ప్రణబ్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించాయి. కలాంను అవి ప్రతిపాదించాయి. అయితే కొన్ని గంటల్లోనే సమాజ్‌వాది పార్టీ తన అభిప్రాయాన్ని మార్చుకుని ప్రణబ్‌కే మద్దతు తెలిపింది. ఈ నేపథ్యంలో యుపిఏతో విభేదించిన తృణమూల్ కాంగ్రెస్ ప్రణబ్‌కు పోటీగా బరిలో నిలిచిన పి.ఏ.సంగ్మాకు మద్దతు పలికింది. పోటీకి కలాం నిరాకరించడంతో ఎన్డీఏ కూడా మొన్నటివరకు యుపిఏ కూటమిలోనే కొనసాగిన పి.ఏ.సంగ్మాకు మద్దతు పలుకక తప్పలేదు.



### మారుతున్న స్నేహాలు

రాష్ట్రపతి ఎన్నికల పుణ్యమా అని దేశంలో కొత్త రాజకీయ సమీకరణాలు చోటుచేసుకుంటున్నాయి. 2014ఎన్నికలే లక్ష్యంగా యుపిఏ, ఎన్డీఏలు పటిష్ఠమైన ప్రాంతీయపార్టీలతో తమ కూటములను బలోపేతం చేసుకోవడానికి శ్రీకారం చుట్టాయి. రాష్ట్రపతి ఎన్నికల తర్వాత మరిన్నిమార్పులు రానున్నాయి.

రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక, మద్దతు విషయంలో యుపిఏలో కంటే కూడా ఎన్డీఏ కూటమిలోనే విభేదాలు ఎక్కువగా బయటపడ్డాయి. ప్రణబ్ విషయంలో యుపిఏలో ఒక్క తృణమూల్ కాంగ్రెస్ మాత్రమే విభేదించింది. కాని అదే ప్రణబ్‌కు పోటీగా అభ్యర్థిని నిలబెట్టే విషయంలో ఎన్డీఏతో ఆ కూటమిలోని జనతాదళ్, శివసేన వంటి మిత్రపక్షాలు వ్యతిరేకించాయి. బీజేపీలోని కొందరు సభ్యులు సైతం ప్రణబ్‌కే మద్దతునివ్వాలని బహిరంగంగానే తమ అభిప్రాయాలను వ్యక్తపరచడం జరిగింది. కాకపోతే రాష్ట్రపతి ఎన్నికలలో ఎన్డీఏకు కలిసొచ్చిన అంశం కొత్తమిత్రులను దగ్గర చేసుకునే అవకాశం రావడం. యుపిఏతో ఇక తృణమూల్‌కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కలిసి కొనసాగడం కష్టమే. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ - కాంగ్రెస్‌ల మధ్య ఇప్పటికే చిచ్చు ఏర్పడింది. ఇప్పుడు రాష్ట్రపతి ఎన్నికల విషయంలో అది ఆరని చిచ్చులా మారింది. తృణమూల్ కాంగ్రెస్ దూరమవుతున్న నేపథ్యంలో వామపక్షాలను దగ్గర చేసుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుంది. అదే సమయంలో యుపిఏ నుండి విడిపోబోతున్న పాత మిత్రురాలిని అక్కున చేర్చుకునేందుకు బీజేపీ పావులు కదుపుతుంది.

ఇక సంగ్మాకు మద్దతు పలకడం ద్వారా అన్నాడిఎంకె, బిజూ జనతాదళ్ పార్టీలు ఇప్పుడు బీజేపీకి కొంచెం దగ్గరగా వున్నాయి. ఈ రెండూ కూడా ఒకప్పుడు బీజేపీ మిత్రపక్షాలే. తర్వాతికాలంలో దూరమయ్యాయి. ఇప్పుడు మళ్లీ దగ్గరయ్యే అవకాశాలు ఏర్పడుతున్నాయి.

రేపు జరుగనున్న రాష్ట్రపతి ఎన్నికలతోనే 2014లోక్‌సభ ఎన్నికల స్వరూపం ఎలావుండబోతుందనేది స్పష్టమవుతుంది. యుపిఏ నుండి తృణమూల్ బయటకు వచ్చే అవకాశాలుండగా, రాష్ట్రపతి ఎన్నికల వరకే తాము బీజేపీతో విభేదించామని. మిగతా పరిస్థితుల్లో తమ మైత్రి బంధం అలాగే కొనసాగుతుందని దళ్(యు), శివసేనలు స్పష్టం చేయడం జరిగింది. ఇక అన్నాడిఎంకె, బిజూ జనతాదళ్ రూపంలో ఎన్డీఏకు కొత్త మిత్రులు కలిసిరానున్నారు. వామపక్షాలు, ఎస్పీ, బిఎస్పీ పార్టీలు సైతం యుపిఏ అభ్యర్థి ప్రణబ్‌కే మద్దతు పలుకుతుండడంతో ఇప్పట్లో మూడోకూటమి నిర్మాణం వుండకపోవచ్చునని తెలుస్తుంది. అయితే ఎన్డీఏకు అప్పుడే బాలారిష్టాలు మొదలయ్యాయి. ఎన్డీఏ కూటమి తరపున లౌకికవాది అయిన నాయకుడే ప్రధాని అభ్యర్థి కావాలని ప్రధాన భాగస్వామి దళ్(యు) నేత నితీష్‌కుమార్ బాంబు పేల్చాడు. మళ్లీ పెద్దపార్టీ అయిన బీజేపీ నుండే ప్రధాని అభ్యర్థి రావాలని కూడా ఆయన వ్యాఖ్యానించడం జరిగింది. దేశంలోని ఇతర రాజకీయపక్షాలు పాటించే లౌకిక విధానానికి బీజేపీ అనుసరించే లౌకిక విధానానికి చాలా తేడా వుంటుంది. మైనార్టీలుగా వున్న వారిని ఓటు బ్యాంకుగా చూస్తూ వారిని దువ్వడమే ఇతరపక్షాల లౌకిక విధానమైతే, ఈ దేశానికి అనాదిగా వున్న పునాది వంటి భారతీయ సంస్కృతికి పెద్దపీట వేస్తూ అన్ని మతాలను ఒకే కోణంలో చూడాలన్నది బీజేపీ లౌకిక విధానం. నితీష్‌కుమార్ కోరుకున్న లౌకిక ప్రధాని అభ్యర్థి ఈ లెక్కన చూస్తే బీజేపీలో కాగడాపెట్టి వెదికినా కనిపించడు. వాజ్‌పేయితోనే అలాంటి నాయకుల తరం ముగిసింది. బీజేపీలో ఎవర్ని చూసినా అద్వానీ, నరేంద్రమోడీ వంటి ధోరణిగల నాయకులే కనిపిస్తారు. మరి నితీష్‌కుమార్ తాను తలచుకున్న లౌకిక సిద్ధాంతాన్నే పట్టుకుని వేలాడితే ఎన్డీఏలోనూ మిత్రబేధం తప్పదు.

## 'అంతర్'జాతీయం

- ఇస్రో సమాచార ఉపగ్రహాలు, పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ తయారీని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే యోచనలో వున్నట్లు తెలుస్తుంది. వీటి బాధ్యతను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం ద్వారా శాస్త్రవేత్తలకు మరిన్ని పరిశోధనల మీద దృష్టిపెట్టేందుకు అవకాశం కలుగుతుందని ఇస్రో భావిస్తుంది.
- భారతదేశంలో గ్రామీణ ఆరోగ్యసేవల కోసం నార్వే ప్రభుత్వం 250కోట్ల నిధులు అందజేయనుంది. నార్వే-భారత్ భాగస్వామ్య కార్యక్రమం క్రింద ఈ గ్రాంటు అందనుంది.
- ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ ధోనీ ఒక ర్యాంకు తగ్గి ఐదోస్థానంలో నిలిచాడు. విరాట్‌కోహ్లీ మాత్రం మూడోస్థానంలో కొనసాగుతున్నాడు.
- చైనా దివంగత నేత మావోను తాను తండ్రిగా భావించేవాడినని బౌద్ధమత గురువు దలైలామా పేర్కొన్నారు. ఆదివారం ఆయన లండన్‌లో బిబిసికిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ మావో కూడా తనను బిడ్డలాగా ఆదరించారన్నారు.
- రాష్ట్రపతిగా పదవీవిరమణ చేసిన అనంతరం పూణేలో నివాసం ఏర్పరచుకోవాలని ప్రతిభాపాటిల్ భావిస్తున్నారు.
- రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికలో ఏకాభిప్రాయానికి యుపిఏ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ అద్వానీ తన బ్లాగ్‌లో విమర్శించారు. అభ్యర్థిని ప్రకటించకముందు తమతో చర్చించలేదని, ప్రణబ్‌ను అభ్యర్థిగా ప్రకటించాకే తమతో మాట్లాడారని అన్నారు.
- ఆదర్శ్ కుంభకోణం పాపం మహారాష్ట్ర మాజీసీఎం విలాస్‌రావ్ దేశ్‌ముఖ్‌దేనని కేంద్రమంత్రి సుశీల్‌కుమార్‌షిండే ఆరోపించారు. విలాస్‌రావు హయాంలోనే భూకేటాయింపులో అక్రమాలు జరిగాయని ఆయన ఆదర్శ్ కమిటీ విచారణకు హాజరై చెప్పారు.
- అణ్వస్త్రాలతో ఎదురుదాడి చేసే సామర్ధ్యాన్ని భారత్ నౌకాదళం త్వరలో సంపాదించుకోనుందని నౌకాదళాధిపతి అడ్మిరల్ నిర్మల్‌వర్మ చెప్పారు. బ్రిటన్ నౌకాదళంతో సంప్రదింపులకు వెళ్లిన ఆయన ఈమేరకు భూతలం, గగనతలం, సముద్రం నుండి మూడు విధాలుగా ఎదురుదాడి చేయగల వ్యవస్థలను అభివృద్ధి చేసుకుంటుందని ప్రకటించారు.
- తాను చేయని తప్పుకు పాకిస్థాన్‌లోని జైల్‌లో 22సంవత్సరాలుగా వుంటూ, మరణశిక్షను ఎదుర్కొంటున్న భారతీయుడు సరబ్‌జిత్ సింగ్‌కు పాక్ అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ జర్దారీ మంగళవారం క్షమాభిక్ష ప్రసాదించారు. జీవితఖైదు 14ఏళ్లుకాగా, ఆయన ఇప్పటికే 22ఏళ్ల శిక్ష అనుభవించడంతో జైలు నుండి సొంత దేశానికి రానున్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- బయటిసాయం మనకు అక్కర్లేదు.
– ఆర్థిక వ్యవస్థపై ప్రధాని మన్మోహన్.
వ్యాఖ్య :- *కూల్చడానికా? నిలబెట్టడానికా?*

వార్త :- రూ. లక్షకోట్ల అవినీతి ప్రజల్ని కదిలించలేదు.
– మంత్రి కన్నా లక్ష్మీనారాయణ.
వ్యాఖ్య :- *కాబట్టి లక్షకోట్లను దాటవచ్చంటారు.*

వార్త :- మద్యంపై బలమైన పోరాటం చేయాల్సిందే.
– వివిధ పార్టీల నేతలు.
వ్యాఖ్య :- *మీరు పోరాటాలు చేసేకొద్దీ తాగేవాళ్లు ఎక్కువవుతున్నారు.*

వార్త :- మరుగుదొడ్లు లేకుండా అగ్నిక్షిపణులెందుకు.
– కేంద్రమంత్రి జైరాం రమేష్.
వ్యాఖ్య :- *ఇన్ని వేల క్షిపణులను తయారుచేసిన తర్వాత ఆ విషయం గుర్తొచ్చిందా?*

వార్త :- రాష్ట్రంపై కరుణించని వర్షం.
వ్యాఖ్య :- *వరుణదేవుడెప్పుడో కాంగ్రెస్‌ను వదిలిపోయాడుగా!*

వార్త :- పోలీస్‌స్టేషన్‌లకు వచ్చేవారు చిరునవ్వుతో వెళుతున్నారు.
– డిజిపి వి.దినేష్‌రెడ్డి.
వ్యాఖ్య :- *వైరాగ్యంతో నవ్వే పిచ్చినవ్వులేమో!*

వార్త :- లాటరీల ప్రభుత్వమిది. – చంద్రబాబు.
వ్యాఖ్య :- *సీఎం ఎంపిక కూడా లాటరీ ద్వారానే కదా!*

వార్త :- సొంత రాష్ట్రంలో నాకు సౌకర్యాలు కల్పించడం లేదు. – రోశయ్య.
వ్యాఖ్య :- *తమిళనాడు వాళ్లు చూసుకుంటారులే అని సరిపెట్టుకుని వుంటారు.*

వార్త :- ముస్లిం రిజర్వేషన్లు కేంద్రం చలవే! – షబ్బీర్ అలీ.
వ్యాఖ్య :- *మరి దేశమంతా లేవే!*

వార్త :- రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేయం. – సీపీఐ.
వ్యాఖ్య :- *మీరే ఓటు హక్కు వాడుకోకపోతే జనాలను తిట్టి ఏం లాభం.*

వార్త :- లోకేష్‌ను రాజకీయాల్లోకి తేవాలి. – చంద్రబాబుకు నేతల సూచన.
వ్యాఖ్య :- *చంద్రబాబు ఇక పనికిరాడనేగా?*

వార్త :- ఈ ప్రభుత్వంలో అన్నీ నకిలీలే. – దేశంనేతలు గాలి, బొజ్జలు.
వ్యాఖ్య :- *ఆఖరకు ప్రతిపక్షం కూడా నకిలీదే!*

## రైతులకు సబ్సిడీ తరంగాలు

**నాబార్డు ఏజీయం**

స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో రాపూరు మండల పరిషత్ కార్యాలయంలో రైతు క్లబ్‌ల అవగాహనా సదస్సు 24వ తేదీన జరిగింది. నాబార్డు ఏజీయం ఆర్.వివేకానందరెడ్డి సదస్సులో పాల్గొన్నారు. నెల్లూరు జిల్లాలో 800 రైతుక్లబ్‌లున్నాయన్నారు. రైతుక్లబ్‌ల ద్వారా రైతులకు సబ్సిడీతో రుణాలు పంపిణీ చేయనున్నట్లు వివేకానందరెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం మరో 100 రైతుక్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రైతులు రైతుక్లబ్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. సదస్సులో స్టేట్ బ్యాంకు అధ్యక్షుడు ఎస్.కె.ఆమీర్, మండల రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో అనేక రాయితీలు

**- శ్రీమతి సామ్రాజ్యలక్ష్మి**

ఆర్టీసీ ప్రయాణీకుల కొరకు అనేక రాయితీలు ప్రవేశపెట్టున్నామని ప్రకటించారు ఆర్టీసీ డిప్యూటీ సిటియం సామ్రాజ్యలక్ష్మి. 24వ తేదీ వెంకటగిరి ఆర్టీసీ కార్యాలయ ప్రాంగణంలో ప్రయాణీకుల లక్కీడిప్ తీసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ఉచితపాస్‌లు, క్యాట్‌కార్డు, తదితర ఆర్టీసీ రాయితీల గురించి ఆమె వివరించారు. ఆర్టీసీని ఆదాయాల్లో నడిపించే బాధ్యత ప్రయాణీకులదేనన్నారు. కార్యక్రమంలో డీయం రామ్మోహన్‌రావు, ఎన్‌ఎంయు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వర్గీకరణ తేల్చండి!

**యంఆర్‌పియస్ డిమాండ్**

రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు అఖిలపక్షాన్ని ప్రధాని మన్మోహన్ సింగ్‌తో ములాఖత్ చేయాలని ఎమ్మార్పీయస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మల్యాద్రి మాదిగ డిమాండ్ చేశారు. 24వ తేదీ ఆదవిలోని ఒక హోటల్‌లో జరిగిన యంఆర్‌పియస్ సమావేశంలో ఆయన ఈమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్లాల్సిందిగా కోరారు. సమావేశంలో నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపల్లి బాలకోటయ్య, ఎమ్మార్పీయస్ నేతలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్యబృందం


అనంతసాగరం మండలపరిధిలోని ఏతదేవరాయునిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో 21వ తేదీ బివిఎస్ఆర్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితకంటి వైద్యశిబిరం జరిగింది. 52 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. 32మందికి కంటి ఆపరేషన్లు అవసరమని, వారికి తమ వైద్యశాల ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు జరుపనున్నామన్నారు. వైద్యశాల ఆధ్వర్యంలో శిబిరానికి హాజరైన వారందరికి మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు.

## శంకరమఠంలో శ్రీ సత్యనారాయణ వ్రతం

వ్యాసపూర్ణిమనాడైన జూలై 3వ తేదీన కావలి పాతూరులోని శంకరమఠంలో ఉచిత సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు మఠం అధ్యక్షులు ద్వారపూడి సిద్ధాంతి భాస్కరశాస్త్రి, సుబ్రహ్మణ్యంలు తెలిపారు.

# నిన్న కళకళ... నేడు వెలవెల

- తగ్గిన కాసుల గలగల
- దారుణంగా పడిపోతున్న రియల్ మార్కెట్
- ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడమే కారణం
- ఇతర వృత్తులవైపు బ్రోకర్లు




దివంగతనేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నంతకాలం నెల్లూరుజిల్లాలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం మూడు లే-అవుట్లు ఆరు ప్లాట్లు అన్నట్లుగా సాగింది. ఆయన హయాంలో కొండక్రింద భూములకు కూడా ధరలొచ్చాయి. గడ్డి పరకలు మొలవని భూములు సైతం లక్షలు పలికాయి. రైతులు వ్యవసాయం చేయలేక బీడుగా వదిలేసిన భూములు ఆయన పుణ్యమా అని లక్షలు పలికి, రైతులను కోటీశ్వరులను చేసాయి. జిల్లాలో నడుంచి జిల్లా ఉత్తర సరిహద్దుదాకా ప్రకటించిన సెజ్‌లు, ఎయిర్‌పోర్టు, కృష్ణపట్నం పోర్టు, పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఇత్యాదికారణాలతో జిల్లాలో రియల్ బూమ్ పంచకల్యాణిలా పరుగులు తీసింది.

కాని వై.యస్. మరణం జిల్లాలో రియల్ రంగానికి శాపంగా పరిణమించింది. ఆయన మరణంతోటే జిల్లాలో రియల్‌మార్కెట్ పతనం ప్రారంభమైంది. వై.యస్. మరణించిన తర్వాత ఈ మూడేళ్లలో జిల్లాలో ఎక్కడా ఒక్క ప్రాజెక్టుకు గాని పరిశ్రమకు గాని శంకుస్థాపన జరగలేదు సరికదా, ఆయన హయాంలో అనుమతులు మంజూరైన కొన్ని పరిశ్రమలు కూడా తదనంతరకాలంలో ప్రభుత్వం నుండి తగినంత సహకారం లేక వెనక్కు మళ్లాయి. కొత్త పరిశ్రమలు రావడం మాట అటుంచితే, అప్పటికే వచ్చిన పరిశ్రమలు వెనక్కి తగ్గడంతో రియల్ మార్కెట్‌లో కౌన్‌డౌన్ ప్రారంభమైంది.

నెల్లూరు నగరం, జిల్లాలోని మిగతా పట్టణాలలో అవసరం కొద్దీ స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నాయి. గతంలోలాగా అడవుల్లో లే-అవుట్లు వేస్తే హాట్‌కేకుల్లా అమ్మే పరిస్థితి లేదు. రియల్ బూమ్‌లో కోట్ల రూపాయలు పెట్టి భూములు కొన్నవాళ్లు అటు వాటికి వడ్డీలు కట్టలేక, ఇటు తక్కువ ధరకు అమ్ముకోలేక సతమతమవుతున్నారు.

జిల్లాలో రియల్ వ్యాపారం జోరుగా వున్నప్పుడు వేలాదిమంది బ్రోకర్లకు ఇదే జీవనాధారమైంది. ఇప్పుడు వారికి చేతిలో పనిలేకుండా పోయింది.

రియల్ రంగంలో ఇప్పుడు ప్రతి ఒక్కరిదీ ఒకే రకం ఆశ... జగన్ సీఎం అయితే నెల్లూరు రియల్ మార్కెట్‌కు మంచిరోజులొస్తాయని...!



PDF Compressor Free Version



# వేడుకగా వెన్నెలకంటికి 'వెండిపండుగ'

నెల్లూరు టౌనుహాలులో ఈనెల 23న విజేతఆర్ట్స్ ఆధ్వర్యంలో "వెన్నెలకంటి వెండిపండుగ" వేడుకగా జరిగింది. మంచి సినీకవిగా, డబ్బింగ్ సినిమాల రచయితగా ప్రసిద్ధిచెందిన నెల్లూరీయుడు వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ 25సంవత్సరాల సినిమా రంగ ప్రస్థానం పూర్తయిన సందర్భంగా రజతోత్సవాన్ని రసరమ్యంగా నిర్వహించారు. వెన్నెలకంటిని సినీరంగానికి గేయరచయితగా పరిచయంచేసి వెన్నుదన్నుగా నిలిచిన నెల్లూరీయులు ప్రముఖ సినీనేపథ్య గాయకులు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఈ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ 25సంవత్సరాల క్రితం బ్యాంకు ఉద్యోగిగా వున్న వెన్నెలకంటిని సినీరంగానికి పరిచయం చేసినందుకు ఆనందం కలిగేలా మంచి రచనలు చేశాడని, అందుకు తగ్గ గుర్తింపు ఆయనకు రాలేదని బాధపడ్డారు. ప్రఖ్యాత డబ్బింగ్ రచయిత రాజశ్రీ మరణానంతరం ఆయనలేని లోటును తీర్చేలా వెన్నెలకంటి డబ్బింగ్ చిత్రాలకు రచనలుచేసి లబ్ధప్రతిష్ఠులయ్యారని పేర్కొన్నారు. ఆయన రాసిన రెండువేల పాటల్లో పదిహేనువందలదాకా తానే పాడానని తెలిపారు. మొట్టమొదట తాను ఈ టౌనుహాలులోనే పాటపాడానని, అది తనకొక మరుపురాని మధురజ్ఞాపకమని అన్నారు. ప్రముఖ సినీ రచయిత పి.రాజేంద్రకుమార్ మాట్లాడుతూ వెన్నెలకంటికి సినీ పరిశ్రమలో "ఎమర్జెన్సీరైటర్" అనే పేరుందని, ఆయన గొప్ప గేయరచయితని తెలిపారు. ఇటీవల సాక్షి ద్వారా ప్రజల మనస్సుల్లోకి చొచ్చుకెళ్లిన "పెద్దాయనా, పెద్దాయనా" పాట ఈయన రాసిందేనని పేర్కొన్నారు. తదుపరి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ దంపతులను సినీగీతరచయిత భువనచంద్ర, డబ్బింగ్ కళాకారుడు ఘంటసాల రత్నకుమార్, సినీగాయకుడు జి.ఆనంద్, రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ కన్వీనర్ తుంగా శివప్రసాద్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ అధినేతలు గ్రోసు గోపాలయ్య, వీరిశెట్టి హజరత్‌బాబు, ఎస్వీబీసి ఛానల్ లైజాన్ ఆఫీసర్ ఎస్వీ శర్మ సమక్షంలో విజేత ఆర్ట్స్ బాధ్యులు శేషగిరీశం తదితరులు ఘనంగా సత్కరించారు. మొదట చిన్నారి గాయకులు మేఘన, సాయిదేవహర్ష, అఖిల, రాఖీలు ఆయన కలం నుంచి జాలువారిన సినీ గీతాలను సుమధురంగా ఆలాపించగా, వై.శైలజ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



వెన్నెలకంటి దంపతులను సత్కరిస్తున్న ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, జి.ఆనంద్, పి.రాజేంద్రకుమార్, గ్రోసు గోపాలయ్య, వి.హజరత్‌బాబు, తుంగా శివప్రసాద్‌రెడ్డి తదితరులు

# వైద్యరంగం కుదేలౌతుంది

## - కేంద్రంపై ధ్వజమెత్తిన వైద్యులు

దేశవ్యాప్తంగా ఒక్కరోజు వైద్యులు వైద్యం చేయమని బంద్ చేస్తే అనారోగ్యుల అవస్థలు చెప్పనలవికావు. జూన్ 25న అదే జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఆలోచించి చేసిందో, అవసరం కొద్ది చేసిందో తెలియదుకానీ, ఆ నిర్ణయం వైద్యవృత్తిని నష్టపరచేదని వైద్యులు ఆరోపిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్వులు 100, 105, 115లను విడుదలచేసింది. పార్లమెంటులో "నేషనల్ కమీషన్ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్ ఫర్ హెల్త్" బిల్లును ప్రవేశపెట్టేందుకు అవసరమైన నియమ నిబంధనలే ఈ ప్రభుత్వ ఉత్తర్వులు. దేశవ్యాప్తంగా పటిష్టమైన మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాపై పర్యవేక్షణ, నియంత్రణ కోసమే ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. దీనిపై స్పందించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యరంగాన్ని పూర్తిస్థాయిలో నష్టపరచే కేంద్ర నిర్ణయాలను గర్హిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్యరంగ సిబ్బంది ఒక్కరోజు విధులు బహిష్కరించారు. అనారోగ్యులందరూ అల్లల్లాడిపోయారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం ఓపి చిట్‌లు వ్రాసేవారు కూడా లేకుండా పోయారు. 25వ తేదీ అనారోగ్యం పాలయిన వారందరికీ దాదాపు 24గంటల పాటు వైద్యచికిత్సలు వాయిదాపడ్డాయి.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఐఎంఏ అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రులను, వైద్యులను అందుబాటులో వుంచింది. నెల్లూరుజిల్లాలో ప్రభుత్వ వైద్యులసంఘం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నారాయణ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలల సిబ్బంది, వైద్యులు, వైద్యసంస్థలు, క్లినిక్‌లు నడుపుతున్న వైద్యులందరూ రోడ్డెక్కారు. నెల్లూరు నగరం ఐఎంఏ హాల్‌లో సమావేశమైన వైద్యులు, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై నిప్పులు చెరిగారు. ఐఎంఏ నెల్లూరుశాఖ అధ్యక్షుడు డా॥జడ్.శివప్రసాద్ మాట్లాడుతూ "నేషనల్ కమీషన్ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్‌ఫర్ హెల్త్" వైద్యవృత్తిని వైద్యరంగాన్ని పూర్తిస్థాయిలో దిగజార్చనుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ ఈ బిల్లు ద్వారా క్లినిక్‌లు సైతం మూతపడ్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఐఎంఏ మాజీ జిల్లా అధ్యక్షుడు డా॥అశోక్ ప్రసంగిస్తూ కార్పొరేట్ వైద్యరంగానికి రెడ్ కార్పెట్ పర్చటమే బిల్లు ఆంతర్యమన్నారు. సమావేశానంతరం వైద్యులు ఐఎంఏ హాల్ నుంచి కేవీఆర్ పెట్రోల్‌బంకు నుంచి, ఆర్టీసీ బస్టాండ్, ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ మీదుగా వీఆర్ కళాశాల కూడలికి చేరుకున్నారు. డా॥బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

## ఏసీబీ వలలో చిరుచేప

తిమింగలాలతో దోస్తీ చేస్తున్నారు తప్పితే వల విసిరేందుకు ఎవరూ సిద్ధపడటంలేదు. అందువల్ల నెల్లూరు ఏసీబీ వలలో చిన్న చేపలే పడ్తున్నాయి. దగదర్తి మండలం, దుండిగం గ్రామ వీఆర్వో వెంకటస్వామి అనే రైతు భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇచ్చేందుకు ఐదువేల రూపాయల డిమాండ్ చేశాడు. వెంకటస్వామి ముందస్తుగా మూడువేలు చెల్లించాడు. మూడు నెలలైనా అతీగతీ లేకపోవడంతో వీఆర్వో ప్రతాప్‌ను ఆయన పాస్‌పుస్తకం విషయం ప్రస్తావించాడు. అందుకు ప్రతాప్ ఆగ్రహం ప్రకటిస్తూ ముందు మిగిలిన పైకం ఇవ్వు, తర్వాత పాస్‌పుస్తకం సంగతి చూస్తా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో వెంకటస్వామి ఏసీబీని కలిశాడు. వీఆర్వో ప్రతాప్ రెండువేలు తీసుకుంటూ 25వ తేదీ ఏసీబీ వలలో చిక్కాడు. వల విసురుడు కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు చంద్రమౌళి, వెంకటేశ్వరరావు, సుధాకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు. లంచం తీసుకోవటం ఎంత నేరమో? లంచం ఇవ్వటం కూడా అంతే నేరం అని చట్టం చెబుతుందంటున్నారు. మరి వెంకటస్వామి చేసింది కూడా నేరమేకదా? ఇలాంటి వారు లంచాలు ఇస్తుండటం వల్లనే, లంచగొండి అధికారులు కూడా తయారవుతున్నారు. అందుకే తిమింగలాలు సముద్రాలను త్రాగేస్తుంటే, జెల్లచేపలు ఏసీబీ వలలో పడ్తుంటాయి అంతే.

# జగన్‌మీడియా కాంగ్రెస్‌పార్టీపై బురదజల్లుతుంది

## - నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే వివేకా



ఉపఎన్నికలలో వైయస్సార్సీ గెలిచినంత మాత్రాన వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన తప్పులన్నీ ఒప్పులైపోవు అంటూ కార్యకర్తలకు వివరించారు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. 24వ తేదీ నెల్లూరు నగరంలోని ఇందిరా భవన్‌లో రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశంలో ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఓటమిపై ఆయన సమీక్షించారు.

జగన్ చేసిన నేరాలకు కనీసం 20సంవత్సరాలకు తగ్గకుండా జైలు జీవితం గడపక తప్పదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో వైయస్సార్సీ గౌరవాధ్యక్షురాలు శ్రీమతి విజయమ్మ, కుమార్తె షర్మిలతో వైయస్సార్సీకి ఓటువేస్తే తన బిడ్డ జగన్ జైలు నుంచి విడుదలౌతాడని ఏడుపులు పెడబొబ్బలు పెట్టించి ప్రజల సానుభూతితో వైయస్సార్సీ అభ్యర్థులు గెలిచారని వివేకా విశ్లేషించారు. ఆయన తన మీడియా ద్వారా అబద్ధపు ప్రచారాలు చేస్తూ, తన తండ్రికి చెడ్డపేరు తెచ్చేలా కాంగ్రెస్‌పార్టీపై బురదజల్లుతున్నాడని శాసనసభ్యుడు తీవ్రంగా విమర్శించారు.

వాన్‌పిక్‌కు కేవలం 30ఎకరాల స్థలం సరిపోతుందని అలాంటిది రైతుల నోరుకొట్టి వారి భూములు 28వేల ఎకరాలు అక్రమంగా లాక్కొన్నందుకు దేవుడే ఆయనకు జైలుశిక్ష విధించాడని అన్నారు. విజయమ్మ కార్చిన గ్లిజరిన్ కన్నీళ్లను ఎప్పుడూ ప్రజలు నమ్ముతారని, ఎల్లకాలం ఓటు వేస్తారని భావించటం సరికాదన్నారు. కాంగ్రెస్‌పార్టీ వటవృక్షం వంటిదని, జగన్‌లాంటి చీడపురుగుల వల్ల అక్కడక్కడా దెబ్బతిన్నా తిరిగి కోలుకొని శాశ్వతంగా ప్రజలకు నీడనిచ్చి అండగా వుంటుందని, ఓడిపోయామని అనుకోవాల్సిన అవసరంలేదని కార్యకర్తలకు నచ్చిచెప్పారు. 2014 జనరల్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్తా ఒక సైనికునిలా పార్టీ గెలుపుకోసం కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశంలో నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డీసీసీ ఇన్‌చార్జ్ చాట్ల నరసింహారావు, కోటేశ్వరరెడ్డి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆయా ప్రాంత నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పెండింగ్‌పనులు పూర్తిచేయండి

## - నగర కమీషనర్ టీయస్ఆర్ ఆంజనేయులు



రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన 12, 13 ఆర్థికసంఘం నిధులతో ప్రారంభించి పూర్తికాకుండా వున్న పనులను నెలాఖరులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులు నగర కార్పొరేషన్ కమీషనరు టీయస్ఆర్ ఆంజనేయులు ఆదేశాలు జారీచేశారు. 25వ తేదీ కార్పొరేషన్‌లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఇంజనీర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు సమావేశంలో పాల్గొన్నారు. నెల్లూరునగరంలో మంచినీటి పైపుల నిర్మాణం, నూతన డ్రైన్లు, సీసీ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించి, సకాలంలో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల కోడ్ కారణంగా టెండర్లు పూర్తయినప్పటికీ కొన్ని పనులు ప్రారంభం కాలేదన్నారు. అలాగే ఇసుక ఇబ్బందుల వల్ల కూడా నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయన్నారు. ప్రస్తుతం ఇబ్బందులు తొలగిపోయిన దృష్ట్యా పనులను వేగవంతం చేయాలని, వర్షాకాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో కార్పొరేషన్ ఇంజనీరింగ్‌శాఖ ఇంజనీర్లు సంపత్‌కుమార్, సంజయ్, అనిల్, పద్మజ, అప్పమ్మ, నాగేంద్రకుమార్, ముజాహిద్దీన్‌లతో పాటు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఫిట్టర్లు పాల్గొన్నారు.



ప్రముఖ బంగారం మరియు వజ్రాభరణాల షోరూమ్ Joyalukas ప్రారంభోత్సవం సందర్భంగా మొదటగా డైమండ్ రింగ్ కొనుగోలు చేసిన అంతర్జాతీయ వెటరన్ క్రీడాకారుడు డాక్టర్ మండవ శ్రీధర్‌రావు (అనిటాహాలు ప్రక్కన, నెల్లూరు. సెల్.98490 77447)కు అందాలతార కుమారి నిత్యామీనన్ చేతులమీదుగా అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ హోటల్ అధినేత వి.హజరత్‌బాబు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# ముగిసిన మద్యం జాతర

## • దరఖాస్తుల్లోనూ సిండికేట్లు • ఎక్సైజ్ ఆదాయానికి తూట్లు

లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు సన్నివేశం నెల్లూరులో వెంకటగిరి పోలేరమ్మ జాతరను, తూర్పు కనుపూరులో ముత్యాలమ్మజాతరను తల పించిందని చెప్పవచ్చు. మద్యం దుకాణాల లాటరీ కార్యక్రమానికి దరఖాస్తుదారులు అదేదో జగన్మోహన్‌రెడ్డి బహిరంగసభ జరుగుతుందన్నట్లుగా తరలివచ్చారు.

కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకారం జిల్లాలో 348మద్యంషాపులకుగాను 322షాపులకు మంగళవారం మధ్యాహ్నాం నుండి నెల్లూరు లోని కస్తూర్బా కళాక్షేత్రంలో లాటరీ ప్రక్రియను నిర్వహించారు. 322షాపులకు గాను 3983దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తు క్రింద తిరిగి చెల్లించని ధరావత్తుతో ప్రభుత్వానికి 9.96కోట్ల రాబడి వచ్చింది. జిల్లాలో 26దుకాణాలకు దరఖాస్తులే పడలేదు. 32చోట్ల మాత్రం ఒక్కొక్కరే దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ నాగేశ్వరరావు, నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ సూపరిం టెండెంట్లు నరసింహాలు, అంకయ్య, జిల్లా రెవెన్యూ అధికారి వి.రామిరెడ్డిల పర్య వేక్షణలో ఒకటోనెంబర్ దుకాణం నుండి లాటరీ మొదలుపెట్టారు. నెల్లూరు, శెట్టి గుంటరోడ్డులోని మద్యం దుకాణంతో లాటరీ మొదలు కాగా బుధవారం తెల్ల వారేదాకా కూడా ఈ ప్రక్రియ కొనసాగింది. మద్యం దుకాణాలు తగిలిన వాళ్లు ఉత్సాహంతో పోగా, పలుషాపులకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వేసినా ఒక్క షాపూ తగలనివాళ్లు డీలాపడ్డారు.

### సిండికేట్లు – బినామీలు

లాటరీప్రక్రియలోనూ బినామీలు, సిండికేట్లు రాజ్యమేలారు. ప్రాంతాల వారీగా మద్యం వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి ఒక్కో సిండికేట్ నుండి ఒక్కో షాపుకు 10నుండి 20దాకా దరఖాస్తులు వేసారు. మద్యం దుకాణాలు కూడా సిండికేట్ భాగస్వాములకే ఎక్కువగా తగిలాయి.

### మహిళలూ దరఖాస్తుదారులే!

ఒకనాడు మద్యపానానికి వ్యతిరేకంగా ఉద్యమించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది నెల్లూరు మహిళ. అలాంటి ప్రాంతంలో మహిళలు సైతం మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. దాదాపు ప్రతి మద్యం దుకాణానికి ఒకరి నుండి నలుగురైదుగురు వరకు మహిళలు దరఖాస్తు చేసివుండడం విశేషం.

### దరఖాస్తుకు అవస్థలు

ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తుకు గడువిచ్చారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఒక్క చోటే దరఖాస్తులు తీసుకోవడంతో చివరిరోజు వేలాదిమంది దరఖాస్తుదారులు క్యూ కట్టారు. 25వ తేదీ సాయంత్రం క్యూలో నిలబడ్డవాళ్లు 26వ తేదీ తెల్లవారుజామున దరఖాస్తు ఇచ్చి బయటకొచ్చారు. నెల్లూరులో ఒక్కచోటే కాకుండా గూడూరు, కావలి డివిజన్‌లలో కూడా దరఖాస్తుల స్వీకరణ, డివిజన్‌ల వారీగా దుకాణాలకు లాటరీ ప్రక్రియ నిర్వహిస్తే ఇంత అవస్థ వుండేది కాదని దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు.

### నారాయణరెడ్డిపేట రికార్డు

2010వేలంపాటల్లో అత్యధిక రేటు పోవడం ద్వారా నారాయణరెడ్డిపేట మద్యం దుకాణం రికార్డు సృష్టించింది.



అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు క్యూలో దరఖాస్తుదారుల అవస్థలు

ఇప్పుడు జిల్లాలో అత్యధికంగా 155 దరఖాస్తులు అదే దుకాణానికి రావడం మరో రికార్డయ్యింది.

### డి.డిల కోసం ఇక్కట్లు

దరఖాస్తుదారులు ఇప్పుడు తాము కట్టిన 10శాతం నగదు డి.డిల కోసం తంటాలు పడుతున్నారు. బుధవారం మద్యం పాటలు ముగిసిన వెంటనే దరఖాస్తుదారులు తమ డి.డిల కోసం ఎక్సైజ్ కార్యాలయం ముందు క్యూకట్టగా ఇఎస్ వచ్చాకే డి.డిలిస్తామంటూ అక్కడి సిబ్బంది చెప్పడంతో వారికి చిర్రెత్తుకొచ్చింది.

మద్యం లాటరీ సందర్భంగా కస్తూర్బా కళాక్షేత్రం రోడ్డును పోలీసులు ఆక్రమించేసి, ఆ దారిలో రాకపోకలు నిషేధించడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

# పూర్వవిద్యార్థుల అపూర్వకలయిక

నెల్లూరు నగరం పొదలకూరురోడ్డు వద్ద గల జిల్లా పరిషత్ పాఠశాలలో 1989–90సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు 24వతేదీ నెల్లూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ భవనంలో కలిశారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాబోధన చేసిన అధ్యాపక బృందం ఎం.మనోహరరెడ్డి, జనార్ధనరెడ్డి, మస్తానయ్య, సీతాదేవి, వెంకటసుబ్బయ్య, రమణారెడ్డి రమణయ్య, రఘురారావులను సోదర పూర్వవిద్యార్థులు సాదరంగా సత్కరించారు. ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వున్న రాధాకృష్ణారెడ్డి ప్రోద్భలంతో ఈ పూర్వవిద్యార్థుల కలయిక జరిగింది. పాత మధురస్మృతులను వారు నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి సాంస్కృతిక కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

# యూత్ కాంగ్రెస్ ఎన్నికలు

నెల్లూరుజిల్లాలో జూలై 11వ తేదీన యూత్‌కాంగ్రెస్ ఎన్నికలను నిర్వహిస్తున్నామని నెల్లూరు గ్రామీణ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి తెలిపారు. ఇందిరా భవన్‌లో ఆయన నామినేషన్ ప్రక్రియను 25వ తేదీన ప్రారంభించారు. నెల్లూరు నగరం, నెల్లూరుగ్రామీణం, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాలలో యూత్ కాంగ్రెస్ నేతలను ఎన్నుకోనున్నామన్నారు. నామినేషన్లు స్వీకరిస్తున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ డీసీసీ చాట్ల నరసింహారావు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధ, మాజీ మేయర్ శ్రీమతి నందిమండలం భానుశ్రీ, కాంగ్రెస్ నాయకులు కోటీశ్వరరెడ్డి, బర్నా, హరిబాబుయాదవ్, పేరారెడ్డి, మేఘనాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కోనలో కాటేజీలకు
# టిటిడి నిధులు

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు పాలకమండలి సమావేశం, నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన దేవస్థానానికి మూడుకోట్లా 90లక్షల రూపాయల నిధులు కేటాయించారని కోన దేవస్థానం ఛైర్మన్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఆ నిధులను కోనలో 50టిటిడి వసతిగృహాలు నిర్మించేందుకు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పెంచలకోనలో టిటిడి కల్యాణ మండపం నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కల్యాణ మండపానికి అనుబంధంగా ప్రస్తుతం మంజూరు చేసిన నిధులతో 50కాటేజీలను త్వరలో నిర్మించటం జరుగుతుందని ప్రకటించారు. ఈ సందర్భంగా నిధులు మంజూరుచేసిన టిటిడి పాలకమండలి, ఇఓకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.


JULY 2012



| S | M | T | W | T | F | S | S | M | T | W | T | F | S | S | M | T | W | T | F | S |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | | 28 | 29 | 30 | 31 | | | | | | | | | | | |






FACILITIES:

- 52 Well Furnished Deluxe A/c.Rooms
- Multicuisine Restuarant
- Banquet Hall(200 Members)
- Board Room
- 2 Modern Lifts
- Valet Car Parking
- Inter-Com & Internet
- Travel Desk & Lockers

@ SRI SAILAM TOWERS (Reliance Upstairs)
Police Office Road , Nellore.
Phones : 0861-2350111, 2350222, 2350333, 2350444

PDF Compressor Free Version



# కదంబం

## సముద్రం

ముకుంద రామారావు
హైదరాబాద్, 99083 47273.

అలల ఒడ్డున
నా పాదాలు
కనబడుతున్నాయి
మాయమైపోతున్నాయి

తీరంలో ఇన్నింటినీ
అదే పనిగా అలలు కడుగుతున్నాయి

పాదముద్రల్ని చెరిపేస్తున్న సత్యం

కింద పైన పడుతూ లేస్తూ
కెరటాల ఏడుపు

ఎవరికీ అర్థంకాని తన అరుపుల్ని
మోసుకుపోతున్న గాలి


రాస్తున్న రాతల్ని
ఎవరూ చూడకుండా
అవలోనే కలిపేసుకుంటున్న నీరు

అష్ట దిక్కులా ప్రవహిస్తున్న సూర్యకాంతితో
కలుషితమైపోయిన చంద్రుడి
అంటువ్యాధి కదా సముద్రం

నా బాధలే
సముద్రాన్ని కలుస్తున్న నదులనుకుంటానా
కెరటాల బాధలో
చూసే అందరినీ తడిపే
కష్టాల వీడ్కోల్ల ఈ సముద్రాలు

# గూడూరు వార్తలు

## ట్రస్ట్ ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు



గూడూరు పట్టణంలోని పలు ప్రభుత్వ స్కూళ్లలో విద్యనభ్యసిస్తూ పదవతరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 24వ తేదీ స్థానిక ఎంఈవో భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు డీఎస్పీ ఇ.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని ప్రోత్సహించేందుకు జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన ఈ కార్యక్రమం మిగతా విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉపయోగపడుతుందన్నారు. నేడు పట్టణకేంద్రాల్లో, ఉన్న ప్రైవేటు పాఠశాలలపై మోజుతో పలువురు ఆకర్షితులై తమ పిల్లలను ఆ పాఠశాలల్లో చేర్పిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు విద్యార్థులకు లభిస్తున్నాయని, అంతేకాకుండా సుశిక్షితులైన అధ్యాపకులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు. ఇదే విధంగా వేదిక ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై ప్రజలకు చైతన్యం కల్పించడం పట్ల కూడా సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా 10 మంది విద్యార్థులకు మెమెంటోలు, ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్షులు ఎ. నాగేంద్రప్రసాద్, యర్రా రావు, కె. మునిగిరీష్, డాక్టర్ సి. జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వివేకా లెక్కలు చూసి ప్రణబ్ పరార్


## గల్పిక

"కొన్నిన పూరెట్టుమని బిగ్గర చెలెట్టుకుని పీఠంలా నేనొస్తుంటే చెప్పు కేక... మా పీఠంతా కెవ్వు కేక" అని గబ్బర్‌సింగ్‌లోని పాట వస్తుండగా రాష్ట్రపతి అభ్యర్థి ప్రణబ్ ముఖర్జీ పవన్ కళ్యాణ్ లెవల్లో డ్యాన్స్ చేస్తున్నారు. తాను రాష్ట్రపతిగా ఎంపికకావడం లాంఛనప్రాయమేకనే. ఆనందంతో ఆయన ఆ ఆనందతాండవం చేస్తున్నారు. ఆయన చిందులు వేస్తుండగానే సెల్‌ఫోన్ మోగింది. ప్రణబ్ ఫోన్ ఎత్తారు. అవతల అహ్మద్‌పటేల్... అమ్మగారు మిమ్మల్ని రమ్మంటున్నారు అని చెప్పి పెట్టేసారు. అమ్మగారి కేక చెవ్వుతో ప్రణబ్‌ముఖర్జీ కెవ్వు కేక సంగతి మర్చిపోయి టెన్‌జనపథ్‌కు చేరుకున్నారు. ఏం మేడమ్... పిలిచారట అని ఆయన అడిగారు. అందుకు సోనియా... ఏం లేదు ప్రణబ్‌జీ... చిన్న బెస్టింగ్‌కాల్, మన్మోహన్‌సింగ్ మాదిరిగా మీరు రబ్బర్‌స్టాంపు కాదని, అంటిగాసోనీ, అహ్మద్‌పటేల్‌లు అంటుంటే... అవునోకాదో తెల్సుకుందామని నేను చిన్న టెస్ట్ పెట్టాను, ఇంచుగానే వచ్చి స్నామ్‌టెక్స్‌కు నిరూపించుకున్నారని మెచ్చుకుంది. ఇంతలో అక్కడికి కాపీలవున్నతో వచ్చిన వి.హెచ్. హనుమంతరావు... ప్రపంచంలో నాకంటే పెద్ద రబ్బరు స్టాంపులెవరుంటారు మేడమ్, ప్రణబ్‌జీ మీరు కాల్ చేస్తే వస్తారు, అని నేను కాలింగ్ బెల్ కొట్టినా పరుగెత్తుకుంటూ వస్తారు, ఒక్కసారి నన్ను రాష్ట్రపతిని చేయమ్మగా, జీవితాంతం ఇక్కడే కొటమాలిగానైనా పడివుంటాను అని అన్నారు. అప్పుడు సోనియా... రాష్ట్రపతి పదవి నీ స్థాయికి వచ్చినప్పుడు చూద్దాంలే, దానికి ఇంకా టైముంది అని సముదాయించింది. అప్పుడే అక్కడకు దిగ్విజయ్‌సింగ్ పరుగెత్తుకుంటూ వచ్చారు. ఆయన ఆయాసపడుతూ... మేడమ్... ఎవ్వరి నాళ్లు రాష్ట్రపతి అభ్యర్థిగా సంగ్మాకు మద్దతునిస్తున్నట్లు ఇప్పుడే ప్రకటించారు. మనం జాగ్రత్తగా వుండాలి మేడమ్ అని అన్నారు. దానికి సోనియా... మద్దతు ఇస్తే ఇవ్వనివ్వండి. ఎవ్వరి కంటే మనవైపు ఎక్కువ ఓట్లున్నాయిగా అని తేలిగ్గా అంది. మీ తెలివితేటలపైన వుండి... మన పక్షాన ఓట్లున్నప్పుడు మాత్రమే... అలాంటి ప్రకటనలో వచ్చింది మనదే ఓటు అని శేఖర్‌రెడ్డి సామెత అవుతుందన్నారు. వై.వి.శేఖర్‌రెడ్డి సామెత అంటే ఏంటి అని సోనియా అడిగింది. దానికి దిగ్విజయ్... 2007లో నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీకి ఎక్కువ ఓట్లున్నప్పటికీ ఇండిపెండెంట్ అభ్యర్థి బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మన ఓట్లను కొని ఎమ్మెల్సీగా గెలిచారు. రేపు రాష్ట్రపతి ఎన్నికలలోనూ ఇదే సూత్రాన్ని ఎవరైనా వాడితే తొలీ కావాలనుకుంటున్నారు. ఇదే జరిగితే మన పని గోవిందా అని అవకాశమును పలికారు. అప్పుడే సోనియా మదికన్ను మూడా అదిరింది. దిగ్విజయ్ మాటలతో ఆమె కూడా ఆలోచనలో పడింది. ఈ ఎన్నికలలో ప్రణబ్‌ను గెలిపించుకుంటే పార్టీ పరువు పోవడమే కాదు, తాను కావాలని ఆయనను చెప్పుకొట్టు పొంటియాన్నే అపఖ్యాతి వస్తుంది. ఏమ్మిచి ఏమ్మిచి చేసైనా ప్రణబ్‌ను గట్టెక్కించగల మొనగాడు ఎవరూ అని ఆలోచిస్తుండగా, ఆమె ఇటలీ బుర్రకు మేడిన్ ఇండియా ఉపాయం తట్టింది. వెంటనే ప్రణబ్‌తో... ప్రణబ్‌జీ, రాష్ట్రపతి ఎలక్షన్ సేఫ్ యాన్ అయ్యేటట్లుంది. ఈ ఎన్నికలలో మనం గట్టెక్కాలంటే అనితరసాధ్యుడైన ఒక వ్యక్తిని మీరు వెంటనే కలవాలని ఫోన్ నెంబర్, అడ్రస్ ఇచ్చింది.

* * * * *

అది ఇంటర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్. ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన సింహపురి మహానగరంలో రాపూరు ప్రాంతం. స్టైల్ ఆఫ్ సింహపురి నెల్లూరు ధారలేపిన్నట్లే ఆనం వివేకానందరెడ్డి (62+) నివాసం. అప్పుడే తెల్లారింది. సూర్యుడు 360డిగ్రీల వృత్తాకారంలో విగసిగలాడుతున్నారు. వివేకా తన గది తలుపు తెరిచారు. సూర్యుడు పైనుంచే ఆయన కిందకుచూస్తూ నమస్కారంచేసి మళ్లీ లోపలిక్కెళ్లారు. వెళ్తూవెళ్తూ అక్కడ ఎదురుగా ఒక వృద్ధుడు కూర్చుని వుండడం గమనించారు. ఆ వృద్ధుడు కూడా... వివేకా నమస్కారం చేసింది ఎవరికా అని కిందకు చూసారు. అక్కడ మూర్తిగా మూగసినవున్న సి.డి.పాట్లతో వల్లభరం ఆనుమ్మ సంసారాలు ఇలియానా, నమిత వంటి హీరోయిన్ల విలువైన్నిత ఫోటోలు అంటించి వున్నాయి. వివేకా ఇంత శ్రద్ధతో పొద్దున్నే కళ్లు తెరిచి చూసేవి ఏవిరినా అని ఆ పెద్దాయన కూడా ఆశ్చర్యపోయారు. ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది. పిఏ రాజా లోపలకు వెళ్లారు. వివేకా వుండి... బయటెవరో కూర్చొనివున్నారు. ఎవరాయన అని అడిగారు. ప్రణబ్‌సార్ అని రాజా చెప్పారు. ఎవరు మన కాలానికి బదులు అని వివేకా అడిగారు. కాదార్ అని రాజా అన్నారు. ఆలా కాదు వరెడ్డి కాలని ఫలబు అని వివేకా అడిగారు. కాదార్ అని రాజా చెప్పారు. మన అమరచర్ల ప్రణబ్ అయ్యుంటారు అని వివేకా అన్నారు. కాదార్, రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీలోవున్న ప్రణబ్ ముఖర్జీ అని రాజా అసలు విషయం చెప్పారు. ఆ మాటతో వివేకా నెత్తిన బాంబు పేల్చుదమైనట్లు ఒక్క దుమకతెగి... ప్రణబ్ ముఖర్జీని మీ ఇంటి పక్కన విస్తట్టి నుంచి చూసినంత సులభంగా చెప్పావు అంటూ వివేకా ఇక ఇయటకొచ్చి సార్ దాదా, మిమ్మల్ని గుర్తించలేకపోయాను అంటూ లోపలకు తీసుకెళ్లి కూర్చోబెట్టారు. ఇంతలో అక్కడకు ఆయన పంపుడు కుక్క వచ్చి ఫోటో అంటూ అరవసాగింది. వివేకా ఒక ప్యాకెట్‌లో నుండి నాలుగు బిస్కెట్లు తీసి దానికి రెండు పెట్టి తానూ రెండు తిన్నారు. అది చూసి ప్రణబ్ ఆశ్చర్యంతో... అదేంటి దానికి పెట్టిన బిస్కెట్ మీరూ తింటున్నారని అడిగారు. అందుకు వివేకా ఈ బిస్కెట్లు పట్లనే వాటికి విశ్వాసం వుంటుందనేది నా నమ్మకం, అందుకే కాంగ్రెస్‌పార్టీ పట్ల విశ్వాసంగా వుండాలని రోజూ నేను కూడా అదే బిస్కెట్లను నాడుతుంటాను, ఇంతకీ మీరొచ్చిన పనేంటి అని అడిగారు. సోనియా తనను ఎందుకు పంపించిందో ఆయన చెప్పారు. అంతా విన్న వివేకా... డోంట్ వర్రీ అంతా నేను చూసుకుంటాను, నేను ఎన్ని ఎలక్షన్లు చేయలేదు, ఇదో పెద్ద లెక్కా అని... ఇంతకీ బడ్జెట్ ఎంత అని అడిగారు. దానికి ప్రణబ్ వుండి... నా ఖర్చు పదివేల నూటపదహార్లు అని చెప్పారు. దానికి వివేకా... మీ నామినేషన్‌రోజు పడిమందికి బిర్యానీ పొట్లాలు, కార్యకర్తలకు అందించడానికి కూడా ఆ డబ్బులు సరిపోవన్నారు. బిర్యానీ పొట్లాలేంటి... కార్యకర్తలేంటి అని ప్రణబ్ ఆశ్చర్యంగా ప్రశ్నించారు. అందుకు వివేకా... ఎలక్షన్ అంటే ఏమనుకుంటున్నారు సార్... కనీసం 10వేల మంది జనాలతో నామినేషన్ వేయాల్సిన. అరోజు 10వ్యాన్లలో పెట్టాలి. అందులో ఒకటి నెలకున్నకి పెట్టాలి... 10 వేలమందికి ఒకటికి 200రూపాయలు లెక్కన వేసుకున్నా 20లక్షలు. ఇక మద్యం, బిర్యానీ పొట్లాలకు మరో పాతికలక్షలు. ఒక్కో ఎమ్మెల్యే తాను గెలవడానికి 10కోట్లు ఖర్చుపెట్టి వుంటాడు. ఎంపీ ఖర్చు పాతికకోట్లు. ప్రస్తుతం ఓట్లు కొని ఎమ్మెల్యేలు, ఎంపీలు అయిన వాళ్లే ఇప్పుడు వీరి ఓట్లను మనం కొనాల్సివుంటుంది. ఎమ్మెల్యేలకు 10కోట్లు, ఎంపీ ఓటుకు 30కోట్లు అని వేలు పెడదాం. మా స్టేట్‌లో వున్న ఎమ్మెల్యేలను కొనడానికి 2940కోట్లు, ఎంపీలను కొనడానికి 840కోట్లు. మొత్తం 3780కోట్లు ఇక్కడే కావాలి. ఇక అన్ని రాష్ట్రాల ఓట్లను కలిపితే బడ్జెట్ నేలకొట్లలో ఖాయం. ఇంత ఖర్చు భరించడానికి మనం సిద్ధంగా వున్నాం కదా అంటూ లెక్కలు చూసారు. ఆశ్చర్యం... అక్కడ ప్రణబ్ ముఖర్జీ లేరు... కటిచేస్తే మారాలయిలో కలకత్తాకు పోవడానికి టికెట్ కోసం రైల్వేస్టేషన్‌లో టికెట్ కౌంటర్ ముందు నిలబడివున్నారు.

# బాలకార్మికులకు విముక్తి



వివిధ ప్రాంతాల్లో బడికి దూరంగా బాలకార్మికులుగా పనిచేస్తున్న 20మందిని గుర్తించి 24వ తేదీ స్థానిక ఏఆర్డీ సంస్థ కార్యదర్శి జకీర్ 13మంది బాలికలను ఏపి గురుకులంలో మరో ఏడుగురిని ఎస్సీ వసతి గృహంలో చేర్పించారు. ఆయన మాట్లాడుతూ మను బోలు మండలం పిడూరుపాళెంలో 7మంది బాలకార్మికులను గుర్తించామని, వారిని తమ సంస్థ చేరదీసి ఒడిలో చేర్పించడంతో పాటు ఆటపాటలకు అవసరమైన క్రీడాసామాగ్రిని అందించామని తెలిపారు. మినీగురుకులంలో చేర్పించిన బాలికలకు యూనిఫాంలను అందజేస్తున్నామన్నారు. మీరు చక్కగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రతిభగల విద్యార్థుల ఎంపిక



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ట్రస్టీ సురేంద్రరెడ్డి

ప్రతి ఏడాది డ్రీమ్‌ఇండియా ఫౌండేషన్ ద్వారా పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులను గుర్తించి 1వ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రైవేటు స్కూళ్లలో డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ ద్వారా అన్ని ఖర్చులు భరించి ప్రతి యేటా పది మంది విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. ఇందులో భాగంగా 24వతేదీ స్థానిక రోటరీ భవనంలో ఫౌండేషన్ ట్రస్టీ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో పేదవిద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. 2వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాతపరీక్షలను నిర్వహించారు. ఇందులో మంచి ప్రతిభ కనబరిచి ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాల సభ్యులలో పదిమందిని ఎంపికచేసి వారిని ఫౌండేషన్ ద్వారా పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి వారి విద్యకు అవసరమయ్యే అన్ని ఖర్చులను భరిస్తుందని బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో సభ్యులు బి.దశరథరామిరెడ్డి, మునిగిరీష్, ఎస్. నాగేంద్రప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



## మేషం

ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలి. మిమ్మల్ని అవసరార్థం వ్యవహారాలలోకి లాగడానికి ఇతరులు ప్రయత్నిస్తారు. కొద్దిరోజులపాటు పెద్ద మొత్తాలలో పెట్టుబడులను పెట్టకండి. విదేశ ప్రయాణాలకు అవకాశాలు రావచ్చు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరం. వ్యాపారవృద్ధికై ఆలోచనలుంటాయి. బంధువర్గంతో చిన్న కారణాలపై విభేదాలు ఏర్పడగలవు.

అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

## వృషభం

యాజమాన్యాలకు వర్గాలతో సమస్యలు రావచ్చును. క్రయవిక్రయాలలో కొందరు ఆకస్మిక నిర్ణయాలు తీసుకొనవచ్చు. వ్యాపారాలలో పోటీని ఎదుర్కొనడానికి ప్రయత్నం చాలి. ఈ వారం అనుకూలకరంగా ఉంటాయి. వృత్తివ్యాపారాలలో సామాన్య ఆదాయముంటుంది. క్రొత్త పెట్టుబడులు పెద్ద మొత్తాలలో పెట్టకండి. ప్రభుత్వ అనుమతులలో జాప్యం. తండ్రి వర్గానికి అనారోగ్య బాధలుంటాయి.

కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర 1, 2 పాదాలు

## మిథునం

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుంది ఆదాయం పెరుగుతుంది. క్రొత్త వస్తువులు, వాహనాలు, స్థిరాస్తులు సమకూర్చుకొనే ప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగులకు సహోద్యోగులతో అధికారులతో సత్సంబంధాలు నెలకొనగలవు. విద్యా విజ్ఞానపరమైన ప్రయత్నాలకు చేసిన ఖర్చులు అధికంగా ఉంటాయి. సోదరవర్గాలకు మేలు జరుగుతుంది. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు.

మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

## కర్కాటకం

వ్యవహారాలలో అనుకూలత, ఉద్యోగులకు, ప్రైవేటు రంగాల వారికి నెలసరి జీతాలు బాగుంటాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. నిరుద్యోగులకు అవకాశాలు దొరకగలవు. వృత్తివ్యాపారాలలో ఆదాయము స్వల్పంగా పెరుగుతుంది. క్రొత్త పథకాల ప్రయత్నాలు ఆర్థికపరంగా ముందుకు సాగే ప్రయత్నాలుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు.

పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేష

## సింహం

కొత్త వ్యవహారాలు, రావలసిన బాకీలు వాయిదాపడగలవు. పెద్దలు పెట్టుబడులపై ఆలోచనలుంటాయి. త్వరలో పెద్ద ఖర్చులు రాగలవచ్చును. సాహసోపేతమైన ఆర్థిక నిర్ణయాలు చేయకండి. వ్యాపారవర్గాలకు పోటీవల్ల అవకాశాలు చేజారిపోవచ్చును. బంధువర్గంతో సమస్యలు రావచ్చును. క్రొత్త వారితో జాగ్రత్తగా మెలగడం మంచిది. తీర్థయాత్రలు చేయడం ఉంటుంది.

మఖ, పుబ్బ, ఉత్తర 1 పాదము

## కన్య

చేపట్టిన పనులందు శ్రమ. విశ్రాంతి లోపం వంటి ఇబ్బందులు రావచ్చును. ముఖ్య వస్తువులు, పత్రాలు జాగ్రత్తపరచుకొనడం మంచిది. ముఖ్య విషయాలలో గోప్యంగా ఉంచడం మంచిది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఆదాయముండదు. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధ ఉండవచ్చును. కుటుంబంలో అవగాహన లోపం వల్ల విభేదాలు రావచ్చును.

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు



## రాశి – మీ వాసి

తేది 29.06.2012 నుండి
తేది 5.07.2012 వరకు.

ఈవారం వృషభంలో గురుశుక్రకేతువులు, మిథునంలో రవి, కర్కాటకంలో బుధుడు, కన్యలో కుజశనులు, వృశ్చికంలో రాహువు, తుల వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## పంచాంగము:

తేది 30 శనివారము తొలిఏకాదశి పర్వదినము.
తేది 3 మంగళవారము వ్యాసపూర్ణిమ.

**ఆషాఢమాస శుక్లపక్షతిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 29 | శుక్ర | దశమి | ఉ॥గం.12.21ని॥ |
| తేది. 30 | శని | ఏకాదశి | ఉ॥గం.10.04ని॥ |
| తేది. 01 | ఆది | ద్వాదశి | ఉ॥గం.7.27ని॥ |
| | ఏదప | త్రయోదశి | రా॥గం.4.57ని॥ |
| తేది. 02 | సోమ | చతుర్దశి | రా॥గం.2.39ని॥ |
| తేది. 03 | మంగళ | పూర్ణిమ | రా॥గం.12.29ని॥ |

**ఆషాఢమాస కృష్ణపక్షతిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 04 | బుధ | పాడ్యమి | రా॥గం.10.38ని॥ |
| తేది. 05 | గురు | విదియ | రా॥గం.9.05ని॥ |

## తుల

వృత్తిపరంగా వ్యాపకం బాగుంది ఆదాయం పెరుగుతుంది. బంధుమిత్రుల వల్ల క్రొత్త విషయాలు తెలిసి ఆశ్చర్యపడతారు. కుటుంబసభ్యులకు కొద్ది అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగమార్పులు, స్థానమార్పులుండగలవు. అనుకున్న పనులు ముందు వెనుకలుగానో, మార్పులతోగాని సాగుతాయి. వ్యాపారవర్గాలకు ఆశించిన అభివృద్ధి ఉండదు. ఆదాయం తగ్గుతుంది.

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

## వృశ్చికం

ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలపై ఇతరుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. వృత్తివ్యాపారాలలో క్రొత్త పథకాలు ప్రవేశపెట్టడం, ఆదాయవృద్ధి ఉంటుంది. మాట నిలబెట్టుకొనడానికి, పరువు మర్యాదల కోసం కష్టపడతారు. ఉద్యోగులు సహకారంతో ఒక ముఖ్య పని జరుగుతుంది. ప్రతి చిన్న విషయానికి బాగా టెన్షన్ పడుతుంటారు.

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

## ధనుస్సు

వృత్తివ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. స్థానమార్పులు, ఉద్యోగమార్పులుంటాయి. ఉద్యోగులకు అధికారుల సహకారం, ఆదరణ బాగుంటుంది. ఆరోగ్యం, ఆహార విషయాలలో జాగ్రత్త వహించండి. పెండింగ్‌లోగల ఆర్థిక లావాదేవీలు, ఋణాలు పరిష్కారదిశగా సాగుతాయి. క్రొత్త వ్యాపారాలు, ఉపాధి అవకాశాలలో నిలద్రొక్కుకుంటారు.

మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పాదము

## మకరం

కుటుంబ విషయాలలో కొంత నిర్లిప్తత బాధ ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఒక మోస్తరుగా అభివృద్ధి ఆదాయం పెరుగుదల ఉంటుంది. వాహనాలు నడిపేవారు, యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. ఇతరుల విమర్శలను లెక్కచేయకుండా ధైర్యంగా తలపెట్టిన పనిని చేసుకొనిపోతారు. వ్యాపార అభివృద్ధికి, పెట్టుబడులకు అవకాశాలు దొరకగలవు.

ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

## కుంభం

ధైర్యంగా నిర్ణయాలు తీసుకొనడం, అనుకున్న పనులు పూర్తిచేసుకొనడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. అవసరమైన సహకారాలు, ముఖ్యపత్రాలు పొందుతారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంక్‌ఋణాలు లభిస్తాయి. వ్యాపారవృద్ధికి పెట్టుబడులకు అవకాశాలు లభిస్తాయి. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం.

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

## మీనం

అనుకున్న పనులు నిదానంగా జరగడం, మీ ప్రవర్తన కారణంగా కొందరితో విభేదాలు రావడం జరుగుతుంది. ఉద్యోగులకు బాధ్యత నిర్వహణలో మంచి గుర్తింపు. అధికారుల సహకారం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి ఉండదు. ఆదాయం తగ్గుతుంది. అవసరాలకు ఋణాలు చేయడం జరుగుతుంది. ఉద్యోగుల క్రొత్తప్రయత్నాలు ఆలస్యం కాగలవు.

పూర్వాభాద్ర 4 పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

# తెలుగుభాష ఆద్యుడు నన్నయ్య

– మెట్టు రామచంద్రప్రసాద్

తెలుగుభాష ప్రాచీనత్వంపై 24వతేదీ నెల్లూరు పొంయరంగ అన్నదాన సమాజంలో సప్తకళా పరిషత్ వ్యవస్థాపకులు యం.ఆర్.ప్రసాద్ ప్రసంగించారు. అర్బన్‌వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సభ జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ 7వ శతాబ్దంలో తెలుగుభాష శాసనాల ద్వారా పరిణతమైనదన్నారు. గ్రంథమూలంగా తెలుగు ప్రాశస్త్యం ప్రారంభమైంది ఆదికవి నన్నయ్య కాలం నుండేనని సూత్రీకరించారు. అనాదిగా తెలుగుకు ఎంతో మార్పు వచ్చిందని, అనేక భాషా పదాలు తెలుగుభాషలో చేరి సుసంపన్నం అయ్యాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు నూకల వేమయ్య, కొండూరు కృష్ణయ్య, టి.వి.నరసింహం తదితరులు పర్యవేక్షించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో వక్త యం.ఆర్.ప్రసాద్‌ను శుక్లాలువాతో సన్మానించారు.

## ఉద్యోగ మేళా

నెల్లూరు సంపూర్ణ కార్యాలయంలో ఈనెల 25న డిపిఎం శ్రీధర్ ఉద్యోగమేళా నిర్వహించారు. 275మంది నిరుద్యోగులు ఈ మేళాలో పాల్గొనగా 104మందిని ఎంపికచేశారు. 108, 104 అంబులెన్స్‌ల్లో ఉద్యోగుల భర్తీకి రాతపరీక్ష 27న నిర్వహించారు. అందులో ఎంపికైనవారికి హైదరాబాద్‌లో రెండు నెలల శిక్షణ ఇచ్చి తదుపరి పోస్టింగ్‌లు ఇస్తామని తెలిపారు.

# పదిలక్షలు అందజేయాలి

శ్రీకాకుళం జిల్లా లక్ష్మీపేట దళితులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని, బాధితులకు పదిలక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలంటూ అంబేద్కర్ ధర్మపోరాట సమితి జాతీయ వ్యవస్థాపకులు ఇంగిలాల రామచంద్రరావు డిమాండ్ చేశారు. 24వ తేదీ నెల్లూరునగరు. దర్గామిట్ట అంబేద్కర్ భవన్‌లో జరిగిన ఎడిబియస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో ధర్మపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యడవోతు సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.వి.సత్యపాల్, విజ్జేటి రమణయ్య, జె.వెంకటయ్య పాల్గొన్నారు.

# జెన్‌కో విద్యుత్‌కేంద్రంలో రెండోటర్బో

ముత్తుకూరు మండల పరిధిలోని నేలటూరు గ్రామంలోని ఏపిజెన్‌కో దామోదరం సంజీవయ్య 1600మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం వద్ద 24వ తేదీన రెండవ టర్బోస్టేటర్ (జనరేటర్)ను ఏర్పాటుచేయటం జరిగింది. ఈ సంవత్సరం జనవరి 9వ తేదీన 800మెగావాట్ల తొలి జనరేటర్‌ను ఏర్పాటు చేసివున్నారు. యల్అండ్‌టి సంస్థ ఈ భారీ జనరేటర్‌ను అత్యాధునిక స్ట్రాండ్ జాక్ పరికరాల సహాయంతో 17మీటర్ల ఎత్తులో అమర్చింది. ఈ కార్యక్రమాన్ని జెన్‌కో సిఇ శ్రీహరి, యస్‌ఇలు నారాయణమూర్తి బాలాజీ, డిఇలు శ్రీధర్‌రెడ్డి, రామలింగారెడ్డి, ఎడిఇలు సి.మునిప్రసాద్, బాషా, యల్అండ్‌టి అధికారులు రవీంద్రనాథ్‌ఠాగూర్‌లు పర్యవేక్షించారు.

# కార్పొరేషన్ సిబ్బందికి అభినందనలు

నెల్లూరు ఉపఎన్నికలలో విధులను సమర్థవంతంగా నిర్వహించిన కౌన్సిల్, రూరల్ అధికారులు, టీచర్లకు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి భానుప్రసాద్ 26వ తేదీ ఒక కార్యక్రమంలో అభినందించారు. నెల్లూరు నగర కార్పొరేషన్ సమావేశ మందిరంలో జరిగిన అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బెస్ట్‌గా విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమీషనర్ టి.యస్.ఆర్. ఆంజనేయులు పాల్గొన్నారు.




వధువు కావలెను — పెళ్ళి సంబంధాలు — వరుడు కావలెను



1. 1981 నవంబర్ 26 జననం. ఎత్తు 5'91/2". చదువు ఎం.బి.బి.ఎస్. ఉద్యోగం ఎం.డి.(జనరల్ మెడిసన్). ఆస్తివాటా 10కోట్లు. ప్రస్తుతనివాసం కరీంనగర్. ఉన్నతమైన రెడ్డి కుటుంబం.
2. 1984 జూలై 1వ జననం. ఎత్తు 5'9". చదువు బిబిఎమ్(ఫైనాన్స్). ఎం.బి.ఎ(ఫైనాన్స్). బి.ఎ.ఎల్. ఎమ్.ఎస్(ఇంటర్‌నేషనల్ బిజినెస్). వృత్తి ఇ.డి.యస్.పార్క్ హోటల్, సింధూ కాల్లో. ఉన్నతమైన రెడ్డి కుటుంబం.
3. 1980 మార్చి 3 జననం. ఎత్తు 5'10". చదువు ఎమ్.బి.ఎ, సి.ఎ. వృత్తి ఉద్యోగం. జీతం 60,000/-. ఆస్తివాటా 10కోట్లు. ప్రస్తుతనివాసం వెస్ట్ గోదావరి. ఉన్నతమైన రెడ్డి కుటుంబం.
4. 1979 డిసెంబర్ 9 జననం. ఎత్తు 5'11". చదువు బి.కాం(ఆనర్స్), పుట్టపర్తి. హోటల్ మేనేజ్‌మెంట్ స్విస్. ఉద్యోగం వైస్ ప్రెసిడెంట్ ఒడిసీ ఇంటర్నేషనల్ గ్రూప్ రిసార్ట్స్. జీతం 1లక్ష, బెనిఫిట్స్. ఆస్తివాటా 15కోట్లు.
5. 1981 నవంబర్ 30 జననం. ఎత్తు 5'8". చదువు ఎం.బి.ఎ, బి.కాం. వృత్తి ఉద్యోగం(మానుఫ్యాక్చరింగ్). ఉన్నతమైన రెడ్డి కుటుంబం.
6. 1986 జూన్ 23 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్ (అగ్రికల్చరల్ సైన్స్). ఉద్యోగం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్. ఆస్తివాటా 1 1/2 కోటి. స్వస్థలం నెల్లూరు. ప్రస్తుత నివాసం హైదరాబాద్. ఉన్నతమైన రెడ్డి కుటుంబం.
7. 1987 అక్టోబర్ 13 జననం. ఎత్తు 5'5". చదువు ఎమ్.బి. ఆస్తివాటా 1కోటి. ప్రస్తుతనివాసం నెల్లూరు. ఉన్నతమైన రెడ్డి కుటుంబం.
8. 1987 ఆగస్ట్ 7 జననం. ఎత్తు 5'4". చదువు సి.బి.ఐ.టి. ఎమ్.ఎస్. ఆస్తివాటా 10కోట్లు. ప్రస్తుతనివాసం నల్గొండ. ఉన్నతమైన రెడ్డి కుటుంబం.
9. 1989 జూలై 2 జననం. ఎత్తు 5'8". చదువు బి.ఇ(కంప్యూటర్ సైన్స్). వృత్తి ఉద్యోగం బెంగుళూరు. జీతం 4లక్షలు. ప్రస్తుత నివాసం ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.
10. 1988 జూలై 2 జననం. ఎత్తు 5'5". చదువు డ్యూయల్ డిగ్రీ (బి.టెక్. ఎమ్.ఎస్ బై రీసెర్చ్) ఇన్ కంప్యూటర్ సైన్స్. ఉద్యోగం క్వాల్‌కమ్, హైదరాబాద్. జీతం సంవత్సరానికి 9.25 లక్షలు. ప్రస్తుతనివాసం హైదరాబాద్.

పోత్తూరు ... 25-9-13, పెన్నలోతోట, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4. | 98480 34522 / 94406 39460 | పోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



# రైతు సమస్యలపై... వైయస్సార్సీ ఆందోళనలు



విద్యుత్ కోతలు, ఎరువుల ధరలు, విత్తనాల సమస్య తదితర రైతుసమస్యలపై వైయస్సార్సీ 25వ తేదీ జిల్లాలోని వెంకటగిరి, గూడూరు, ఉదయగిరి, ఆత్మకూరు, సర్వేపల్లి, కోవూరు, కావలి నియోజకవర్గాలలో భారీఎత్తున ఆందోళనా కార్యక్రమాలు జరిపింది. ప్రత్యేకంగా విద్యుత్ కోత వల్ల సామాన్య జనంతో పాటు, నిమ్మ, అరటి, ఆకుతోటలు, వంగ, మిర్చి తదితర పంటలు వేసిన రైతులు పూర్తిస్థాయిలో నష్టపోతున్నారంటూ వైయస్సార్సీ నేతలు ఎక్కడిక్కడ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు. వెంకటగిరిలో వైయస్సార్సీ మండల కన్వీనర్ నెమళ్లపూడి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా కార్యకర్తలు తహశీల్దారు కార్యాలయం వద్ద బైటాయించి ధర్నా నిర్వహించారు. గూడూరు సబ్‌స్టేషన్ వద్ద నేదురుమల్లి పద్మనాభరెడ్డి, పాశం సునీల్‌కుమార్, గూడూరు, వాకాడు మండలాల పార్టీ కన్వీనర్లు ఎం.విజయకుమార్‌రెడ్డి, ఉదయశేఖరరెడ్డిల నేతృత్వంలో గూడూరు సబ్‌స్టేషన్ వద్దకు రైతులు భారీగా తరలివచ్చి ఏడిఏకు వినతిపత్రం సమర్పించారు. ఉదయగిరిలో వైయస్సార్సీనేత ఏ.భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ర్యాలీ నిర్వహించి అధికారులకు విజ్ఞప్తి పత్రం అందజేశారు.

ఆత్మకూరు, చేజర్ల పార్టీనేతలు చేజర్ల సబ్‌స్టేషన్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో తోటపల్లి గూడూరులో స్టీరింగ్ కమిటీసభ్యులు చిల్లకూరు సుధీర్‌రెడ్డి, ముత్తుకూరు, మనుబోలు వైయస్సార్సీ మండల కన్వీనర్లు వాకాటి విజయకుమార్, జి.గోపాలరెడ్డిల సారథ్యంలో ఆందోళనా కార్యక్రమాలు జరిపారు. కోవూరు మండలనేత వినోద్‌రెడ్డి సబ్‌స్టేషన్ వద్దకు భారీగా రైతులతో తరలివెళ్లి ధర్నా చేశారు.

కావలి నియోజకవర్గ పరిధిలోని బిట్రగుంట సబ్‌స్టేషన్ వద్ద వైయస్సార్సీ మండల కన్వీనర్ తూపిలి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఒకేసారి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో వైయస్సార్సీ చేపట్టిన రైతు సమస్యల ఆందోళనా కార్యక్రమాలకు రైతుల నుండే కాకుండా సామాన్య ప్రజల నుండి కూడా మంచి స్పందన వచ్చింది.

# పాలన మొదలైంది

(3వ పేజీ తరువాయి)

మరో ప్రక్క ఎన్నికల విషయంలో ఖచ్చితంగా వ్యవహరిస్తూ బయట నుంచి వచ్చిన పారామిలటరీకి అన్ని సదుపాయాలు ఏర్పాటుచేశారు. ఏవో చిన్నచిన్న సంఘటనలు మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్వయంగా పర్యవేక్షించారు.

జాయింట్ కలెక్టర్ సౌరబ్‌గౌర్ 'అడిషనల్ జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, తెలుగుగంగ స్పెషల్ ఆఫీసర్ భానుప్రసాద్' నెల్లూరు ఆర్‌డిఓ శ్రీమతి మాధవీలత, కావలి ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, డ్వామా పిడి యుగంధర్, జడ్పీ సిఇఓ వీరభద్రయ్య, తెలుగుగంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వి.రమణలు తమకు కేటాయించిన నియోజకవర్గాలలో ఎన్నికల పర్యవేక్షణను అమోఘంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో మొత్తం పోలీసు యంత్రాంగమంతా ఎన్నికల నిర్వహణకు కృషిచేసింది.

రాష్ట్ర ఆర్థికమంత్రి నెల్లూరుజిల్లాకు చెందిన వ్యక్తి అయినా కోడ్ నిబంధనల ఉల్లంఘనకు స్థానంలేకుండా జిల్లా కలెక్టర్, ఎస్పీలు వ్యవహరించటం ముదావహం. ఇక వీరంతా ఎన్నికల హడావిడి నుండి బయటకు వచ్చి సాధారణ పరిపాలనపై దృష్టిపెట్టేశారు. మరలా సమస్యలతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల వైపు బారులు కట్టారు.

# 'దేశం'లో మొదలైన రగడ

(3వ పేజీ తరువాయి)

కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడులు పార్టీ గెలుపు కోసం పనిచేయలేదని, సోమిరెడ్డితో కుమ్మక్కై వీరంతా తనను ఓడించడానికి కృషి చేసారని వంటేరు, చంద్రబాబుకు ఫిర్యాదుచేసినట్లు తెలుస్తుంది. సోమిరెడ్డి ఇన్‌ఛార్జ్‌గా వున్న కోవూరు నియోజకవర్గంతో పాటు కన్నబాబు ఇన్‌ఛార్జ్‌గా వున్న ఆత్మకూరు, టి.రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు నాయకత్వం వహిస్తున్న నెల్లూరు నగరం, కిలారి వెంకటస్వామినాయుడు నాయకత్వంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గాలలో వంటేరుకు కనీసం గౌరవప్రదమైన ఓట్లు కూడా రాలేదు. ముఖ్యంగా మూడునెలల క్రితం జరిగిన కోవూరు ఉపఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థి సోమిరెడ్డికి 53వేల ఓట్లు వస్తే లోక్‌సభ ఎన్నికలలో మాత్రం కోవూరు సెగ్మెంట్‌లో వంటేరుకు 12వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే ఈ మూడు నెలల్లో తెలుగుదేశంపార్టీకి 40వేలకుపైగా ఓట్లు తగ్గాయి. సోమిరెడ్డి తన ఎన్నికల మాదిరిగా లోక్‌సభ ఎన్నికలలో కృషి చేయలేదని, కాబట్టే అంత దారుణంగా ఓట్లు వచ్చాయని వంటేరు అనుచరుల వాదన.

అయితే, వంటేరే తన గెలుపు కోసం కృషి చేయలేదని, ఆయనే అంత నిరాసక్తతో వుంటే ఇక కేడర్‌లో మాత్రం ఏం ఆసక్తి వుంటుందని, మన నిరుత్సాహానికి తగ్గట్లుగానే ఓట్లు వచ్చాయని వంటేరు వ్యతిరేకుల వాదన. ఈ విభేదాలు ఇక్కడితోనన్నా ముగుస్తాయో? లేక 2014దాకా కొనసాగుతాయో? చూద్దాం.

# 'కాల్' దువ్వారు!

(మొదటిపేజీ తరువాయి)

జగన్ అక్రమాస్తులకేసును దర్యాప్తు చేస్తున్న సిబిఐ జె.డి లక్ష్మీనారాయణ నిజాయితీని శంకించలేం. గట్టి అధికారిగా, ముక్కుసూటిగా వ్యవహరిస్తాడనే పేరుంది. ఆయన ఛార్జ్‌షీట్ తయారుచేసాడంటే నిందితుడు చుట్టూ ఉచ్చుబిగించినట్లే! సత్యం రామలింగరాజు దానికి ఉదాహరణ. మైనింగ్ కింగ్ గాలి జనార్ధన్‌రెడ్డి ఇప్పుడు కటకటాల వెనుక కటకట అంటూ అల్లాడుతున్నాడంటే దానికి కారణం లక్ష్మీనారాయణ నమోదుచేసిన కేసులే!

అయితే జగన్ కేసుల విషయంలో మాత్రం జె.డి వ్యవహారశైలిపై వైయస్సార్ కాంగ్రెస్ నేతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జగన్ కేసు చాలా కీలకమైనది. ఈ కేసు విచారణ వివరాలు చాలా రహస్యంగా వుంచాలి. నిందితులను అరెస్ట్ చేయడం, ఏ సెక్షన్‌ల క్రింద కేసులు నమోదుచేసారో వంటి వివరాలను మీడియాకు అందించవచ్చు. అంతేగాని నిందితుడిని ఏం అడిగారు. ఆయన సమాధానం ఏం చెప్పాడు... అనేదంతా మీడియాకు చెప్పాల్సిన అవసరం లేదు. తమ విచారణ, దర్యాప్తు వివరాలను బయటకు పొక్కనీయకూడదనే ఉద్దేశంతో సిబిఐ స్వీయనియంత్రణ కోసం స్వయంగా ఒక మాన్యువల్‌ను కూడా రూపొందించడం జరిగింది.

అయితే జగన్ కేసులో సిబిఐ విచారణ వివరాలన్నీ కూడా ఆయనకు వ్యతిరేకంగా వున్న మూడు టీవీ ఛానెల్స్, రెండు దిన పత్రికలలో రాసాగాయి. దీంతో సీబీఐలో లీకువీరులున్నారంటూ వైయస్సార్‌సిపి నాయకులు గత కొంతకాలంగా ఆరోపణలు చేస్తున్నారు. వారి అనుమానాలన్నీ సిబిఐ జె.డి లక్ష్మీనారాయణ మీదే వున్నాయి. దాంతోటే అడ్డదారులు తొక్కి ఆయన కాల్‌లిస్ట్‌ను సంపాదించగలిగారు. హైద్రాబాద్‌లో 'సాక్షి' సీనియర్ విలేకరి యాదగిరిరెడ్డి, మహారాష్ట్రకు చెందిన ఓ పారిశ్రామికవేత్త ఈ కాల్‌లిస్ట్‌ను తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. జె.డి కాల్‌లిస్ట్ చూస్తే హైస్కూల్‌లో తనతో కలిసి చదువుకున్న చంద్రబాల అనే మహిళతోపాటు, ముఖ్యంగా జగన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్న మూడు ప్రధాన టీవీఛానెల్స్ క్రైం రిపోర్టర్లకు జె.డి సెల్‌ఫోన్ నుండి వందలసార్లు కాల్స్, మెసేజ్‌లు వెళ్లివున్నాయి. ఈ కాల్‌లిస్టునే వైకాపా ఎమ్మెల్యేలు బహిర్గతం చేసారు. క్రైం రిపోర్టర్లు జె.డికి ఫోన్ చేయడాన్ని వారు ప్రశ్నించలేదు. ఒక కీలకమైన కేసు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నప్పుడు మీడియా రిపోర్టర్లకు అంత తీరిగ్గా ఫోన్‌లు చేయాల్సిన అవసరం జె.డి కేమొచ్చిందని వారు ప్రశ్నించారు. వాస్తవంగా చూసినా సిబిఐ తరపున ఏదైనా వివరాలివ్వాలనుకుంటే అది పిఆర్‌ఓలు లేదా క్రిందిస్థాయి సిబ్బంది చూసుకోవాలి. లేదా ప్రెస్‌నోట్‌లు రిలీజ్ చేయొచ్చు. కాని స్వయంగా జె.డియే మీడియాకు ఫోన్‌లు చేసి చెప్పాల్సిన అవసరం లేదని చాలామంది టాక్ కూడా!

ఇక జె.డి సెల్ నుండి వందల సంఖ్యలో ఆయన సహవిద్యార్థిని చంద్రబాలకు కాల్స్ వెళ్లాయి. బంధువులు, స్నేహితులన్నాక ఫోన్‌లు చేసి మాట్లాడుకోవడం ఎవరూ తప్పుపట్టరు. కాని జె.డి నుండి చంద్రబాలకు కాల్ పోవడం, ఆ వెంటనే ఆమె సెల్ నుండి ఒక టీవీ అధిపతికి ఫోన్ పోవడాన్నే వైకాపా నేతలు నిలదీస్తున్నారు. జగన్ విచారణలో ఏం జరుగుతుందనేది ఎప్పటికప్పుడు జె.డి చంద్రబాలకు ఫోన్‌చేసి చెబితే, ఆమె ఆ సమాచారాన్ని జగన్‌పై విషం కక్కుతున్న ఓ టీవీ, పత్రిక అధినేతకు వెంటనే చేరవేసిందనేది జగన్ అనుచరుల వాదన. ఈ వాదనకు బలం చేకూర్చేటట్లుగా ఆ టీవీ ఛానెల్ పోకడ వుంది!

దిల్‌కుషా అతిథిగృహంలో జగన్‌ను సిబిఐ విచారించిన మొదటిరోజు మొదటి గంటలోనే ఆ టీవీ ఛానెల్‌లో బ్రేకింగ్ న్యూస్ వచ్చింది. విచారణ ఇప్పుడే మొదలైంది. యుఆర్ కంఫర్టబుల్ అని జె.డి ప్రశ్నించారు. ఐయామ్ కంఫర్టబుల్ అని జగన్ చెప్పారు. కాఫీ, మంచినీళ్లు తీసుకుంటారా? అని జె.డి అడిగారు... వద్దు అని జగన్ చెప్పారు... అంటూ ఆ ఛానెల్‌లో బ్రేకింగ్ న్యూస్‌లు వచ్చాయి. అంటే దిల్‌కుషా అతిథిగృహంలో సిబిఐ జె.డి, ఎస్పీలు, జగన్... ఈ ముగ్గురే వుంటే, వారి మధ్య జరిగిన సంభాషణ ఎలా బయటకొస్తుంది. అంటే ఎవరో ఒకరు లీక్ చేస్తుండాలి. ఆ లీకులు చేస్తున్నది సాక్షాత్తూ సిబిఐ జె.డి లక్ష్మీనారాయణేనని ఇప్పుడు తమకు దొరికిన కాల్‌లిస్ట్ ఆధారంగా వైకాపా నేతలు కుండబద్దలు కొడుతున్నారు.

జగన్ కేసులో మీడియా అత్యుత్సాహం ఎక్కువైందన్నది పచ్చినిజం. దీనివల్లే సిబిఐ దర్యాప్తు పక్షపాతంతో జరుగుతుందనే అనుమానాలొస్తున్నాయి.

ఇక కాల్ లిస్టు బయటపెట్టడం ద్వారా జగన్ వర్సెస్ జె.డి అన్నట్లుగా సీన్ మారిపోయింది. తమ కాల్‌లిస్టు బయటకు రావడంపై, జె.డి., చంద్రబాలలు ఇప్పటికే ఫిర్యాదులు చేయడంతో కాల్‌లిస్టు బయటకు తీసిన వారిపై పోలీసు చర్యలు అప్పుడే మొదలయ్యాయి. అదే సమయంలో జె.డి కాల్‌లిస్టుపై సమగ్ర దర్యాప్తు జరపాలంటూ వైకాపా న్యాయపోరాటానికి సన్నద్ధమవుతుంది. 'కాల్‌లిస్టు'తో ఇరువురూ కయ్యానికి కాలుదువ్వారు. జగన్ అక్రమాస్తులకే నిన్నటివరకు జనపథ్ వర్సెస్ జగన్ అన్నట్లుగా వుండగా, నేడు జగన్ వర్సెస్ జె.డి అన్నట్లుగా మారిపోవడం విశేషం.

# మారిస్తేనే మార్పు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో నల్లారి పాలన నల్లేరు మీద నడకలా లేదు. ఒక రెవెన్యూ గుమస్తా కార్యాలయానికి వచ్చి కూర్చొని గతంలోని ఫైల్స్‌ను క్లియర్ చేసేందుకు పాటుపడ్డట్లే వుంది. ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కిరణ్ రాష్ట్రంలో మొదలుపెట్టిన దాఖలాలేదు. వైయస్సార్ మొదలుపెట్టిన పథకాలను కొనసాగించే కార్యక్రమం మాత్రమే చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కుర్చీకోసం సొల్లు కార్చుకుంటున్న వారు కుల రాజకీయాలు చేస్తున్నారు. ప్రజారాజ్యం పార్టీ పెట్టి పెట్టేబేడా సర్దుకుని తొడగొట్టీ కాంగ్రెస్‌పార్టీకి అమ్ముడుపోయిన చిరంజీవి కూడా సియం కావాలనుకోవటం ఆశ్చర్యమే మరి. నిన్నటిదాకా సోదిలో లేని కిరణ్‌ను సియంగా చూడలేక పోతున్న రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు, ఉపఎన్నికల ఘోర పరాజయానికి ఆయనే కారకుడుగా కన్పడుతున్నాడు. తీక్షణంగా, మాటలు జారారు. అయితే జారినవారంతా కళంకిత మంత్రుల జాబితాలో వున్నవారే. కిరణ్ కుమార్‌రెడ్డి పరిపాలనా వ్యవస్థలో పెనుమార్పులు కాదుకదా? చిరుమార్పులు కూడా తీసుకొని రాలేదు. అది ఆయన అసమర్థత అనుకుంటే పొరపాటే. భారత దేశాన్ని ప్రపంచబ్యాంకు ప్రజావ్యతిరేక సంస్కరణలకు తాకట్టుపెట్టిన కేంద్ర అధిష్టానం అడుగుజాడలలో నడిచిన వైయస్సార్‌కు వారసుడే నల్లారి. నల్లారేకాదు మరో వెంగయ్య అయినా అంతే.

అధికారం కోల్పోతామన్న భయం ఆందోళనా అధికారంలో వున్న వారి నైతిక పతనానికి కారణమౌతుంది. అవినీతి సామ్రాజ్యానికి చక్రవర్తిగా ఉన్న ఎవరూ ఏమి చేయలేని పరిస్థితి. ప్రపంచబ్యాంకు కనుసన్నలలో నడుస్తున్న పాలనలో ప్రజల మద్దతు చేకూర్చుకోలేక కక్ష సాధింపు రాజకీయాలు చేయటం అందుకు కొందరిని బలిచేయటం మామూలే. అలాంటి తప్పిదమే రాష్ట్రంలోనూ జరిగింది. ఈ తప్పును సరిదిద్దుకొనేందుకు అలవాటులో పొరపాటుగా కాంగ్రెస్ చేసే పని ముఖ్యమంత్రిని మార్చటం. అంతకంటే ముందు అవినీతి మంత్రులుగా కొందరిని గుర్తించి వారికి కళంకితమంత్రులుగా నామకరణంచేసి, మరికొందరికి అవినీతి సొమ్ము బొక్కేందుకు అవకాశం ఇవ్వటం. ఈ పరిస్థితుల్లో అధిష్టానం మార్చితేనే రాష్ట్రంలో పాతముఖాలే కొత్తమాస్కులతో పరిపాలన సాగిస్తాయి. అంతకంటే జరిగేది, తరిగేది, ఇరిగేదీ ఏమీలేదు. జగన్ జైలులో వున్నా బయటకు వచ్చినా కాంగ్రెస్‌కు గండంతప్పదు. అది అధిష్టానానికీ తెలుసు. ఇక రాష్ట్రం గతి రాష్ట్రపతి పాలయినా పెద్దగా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదేమో? చూద్దాం... రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో!

# బంద్ ప్రశాంతం

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆయా విద్యార్థిసంఘాలు బుధవారం జూనియర్ కళాశాలల బంద్‌ను నిర్వహించాయి. కళాశాలల్లో స్కాలర్‌షిప్స్, లెక్చరర్ల కొరత, పాఠ్యపుస్తకాలు, మౌలిక వసతులు వంటి సమస్యలపై దృష్టిసారించడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి.

# గత వైభవం సాధ్యమేనా?

(3వ పేజీ తరువాయి)

ఎంతమాత్రమూ లేవు. జిల్లా అంతాకూడా కాంగ్రెస్‌పార్టీ దారుణాతిదారుణంగా దెబ్బతిందనే విషయం ఏబిసిడిలు నేర్చుకునే నర్సరీ స్కూల్ పిల్లోడికి సైతం అర్థమవుతుంది. మరి ఇంతగా దెబ్బతిన్న కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణం సాధ్యమేనా అనేది మిలియన్ పౌండ్ల ప్రశ్న!

PDF Compressor Free Version



# ఘంటసాలే నాకు స్ఫూర్తి

**సినీ నేపథ్యగాయకుడు జి.రామకృష్ణ**



రామకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

మధుర గాయకుడు ఘంటసాల స్ఫూర్తితోనే నేను సినీరంగ ప్రవేశం చేశాను. ఇప్పటి వరకూ ఐదువేల పాటలు పాడగా అందులో నాలుగువేలు తెలుగులోనే పాడాను. మిగిలినవి కన్నడం, హిందీలలో డబ్బింగ్ పాటలు. 1972లో విచిత్రబంధం పిక్చర్‌కు అక్కినేని నాగేశ్వరరావు కోసం ఆ చిత్రంలో గాయకునిగా పాటలు పాడటం జరిగింది. సినీరంగ నేపథ్యగాయకునిగా నా చివరి పాటలు బ్రహ్మంగారి చరిత్రతో ముగిశాయి. ప్రస్తుతం ఇతర దేశాలలో ఘంటసాల స్ఫూర్తితో, ఆయనను స్మరించుకుంటూ పాటకచేరీలు చేస్తున్నానని రామకృష్ణ అన్నారు. జూన్ 24వ తేదీ నెల్లూరుజిల్లా, కోటలోని ఎన్‌సీఆర్ కల్యాణమండపంలో జరిగిన ఘంటసాల కళాసమితి 9వ వార్షికోత్సవంలో రామకృష్ణను ఘనంగా సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఈ తరానికి తాను పాడిన పాటలు నచ్చటం లేదని ఆయన ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. మండలకేంద్రమైన కోటలో కళారంగసేవ చేస్తున్న ఘంటసాల కళాసమితి సేవలను ఆయన అభినందించారు. సన్మాన కార్యక్రమం అనంతరం జరిగిన పాటకచేరీ ఆహూతులను అలరించింది. కార్యక్రమానికి ముఖ్యులుగా గూడూరు, కోట న్యాయమూర్తులు మురళీధర్, వెంకటశేషమ్మలు పాల్గొన్నారు. సమితి అధ్యక్షులు నరసింహులు, కార్యదర్శి ఎం.వి.రావుల ఆధ్వర్యంలో కమిటీ బాధ్యులు రామకృష్ణ, శ్రీహరి శ్రీనివాసు, జగదీష్, సుధాకర్, మురాద్‌బాషా, వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

## సిబ్బంది నియామకాలు జరిగి
# సిల్వర్‌జూబ్లి అయింది

**ఎన్‌ఎఫ్‌ఆర్‌ఆర్‌బీవో జనరల్ సెక్రెటరీ**

పాతిక సంవత్సరాలుగా సిబ్బంది నియామకాలు లేకపోవటం వల్ల ఖాతాదారులకు బ్యాంకు సిబ్బంది నూతన సేవలను అందించలేకపోతున్నారన్నారు ఎన్‌ఎఫ్‌ఆర్‌ఆర్‌బీవో జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటేశ్వరరెడ్డి.

నెల్లూరు నగరంలో జూన్ 24వ తేదీన జరిగిన ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్ సర్వసభ్యసమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సిబ్బంది నియామకాలను పెద్దఎత్తున జరపాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రత్యేకంగా సిబ్బంది నియామకాలలో గ్రామీణ ప్రాంతాల వారికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ తాత్కాలిక సిబ్బందిగా బ్యాంకుల్లో విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలన్నారు. జాతీయ బ్యాంకు ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలను సవరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సమ్మిళిత అభివృద్ధిలో భాగంగా రూరల్ బ్యాంక్స్‌ను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. సమావేశంలో ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ జనరల్ మేనేజర్ పి.ఆదినారాయణరెడ్డి, రీజనల్ మేనేజర్ ఏ.సి.శేషగిరిరావు, ఏపిఆర్‌ఆర్‌బీవో ప్రెసిడెంట్ బి.రమాకాంత్, కేవీజీబీవోఏ కన్వీనర్ బన్సోగోల్, ఉద్యోగులసంఘం సెక్రెటరీ జి.వెంగళరెడ్డి నెల్లూరుజిల్లా అధ్యక్షుడు హనుమంతరావు సెక్రెటరీ శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామీణబ్యాంక్ సిబ్బంది, సభ్యులు సమావేశానికి హాజరైనారు.



ఈ నెల 2[illegible]వ తేదీన నెల్లూరులోని [illegible] ఏపి జెన్‌కో థర్మల్ కేంద్రం భూసేకరణకు ఏర్పాటు చేసిన సమావేశంలో సంబంధిత అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

# థాయిల్యాండ్ పర్యటన

**ఇదీ నా కథ - 56 (1924 - 2011)**




రెండవరోజు మా వంతు వచ్చింది. మా ఏడుగురిలో శ్రీ సుబ్రహ్మణ్యం, వెల్చాల కొండలరావు, సి.హెచ్. రాజేంద్రప్రసాద్ తెలుగు వాళ్ళయినా ఆంగ్ల కవిత్వంలో ఆరితేరిన వాళ్ళు. అందువలన వాళ్ళు తమ పొయిట్రీని ఇంగ్లీషులో వినిపించారు. ఉండేల మాలకొండారెడ్డి, బాపురెడ్డి, ఆచార్య తిరుమల ఇంగ్లీషులోకి అనువదించి తెచ్చుకున్న కవితల్ని వినిపించారు. తర్వాత నేను వేదికనెక్కి ఐకేమ్ ఫ్రమ్ ఇండియా మై మదర్‌టంగ్ ఈజ్ తెలుగు. బికాస్ ఆఫ్ దట్ ఐ విల్ రీడ్ ఇన్ తెలుగు అంటూ...

*"వివిధ దేశములొక్క తావున వెల్లి విరిసిన నందనం.*
*వేగు చుక్కలు గొంతు కలిపిన విశ్వకవి సమ్మేళనం.*
*గమనమెవరిది వారిదైనా గమ్యమందరి దొక్కటేనని*
*వాటి చెప్పిన సత్కవీంద్రుల ప్రతిభకిది పెను దర్పణం."*

అన్న గేయం ఆలపించాను.

తర్వాత థాయిల్యాండ్ గొప్పతనాన్ని వర్ణిస్తూ...

*బౌద్ధ సిద్ధాంతమ్ము ప్రతి ఇంటి ముంగిట*
*తాండ వించెదు నేల థాయిల్యాండు!*
*సర్వాంగ రమ్యమౌ సహజ ప్రకృతి శోభ*
*తళుకు లీనెదు నేల థాయిల్యాండు!*
*ప్రాక్పశ్చిమాల ప్రభావ వాహినిలోన*
*తాన మాడెదు నేల థాయిల్యాండు!*
*శృంగార విపణిలో స్నిగ్ధ సుందరమైన*
*హాయి పంచెదు నేల థాయిల్యాండు!*
*ఉర్వి కృషికన్న సంపదేమున్నదన్న*
*మాట మరువక కష్టించి మాతృభూమి*
*విలువ పెంచిన ప్రజలు వివేకమునకు*
*తనిసి సంబర పడు నేల థాయిల్యాండు!* అని చదివాను.

> బ్యాంకాక్‌లో వ్యభిచారం చట్టబద్ధం. దానికొక ప్రత్యేక ప్రాంగణముంది. ఒకరోజు సాయంత్రం అందరం అక్కడికి వెళ్ళాం. అక్కడ ప్రదర్శించే నగ్న దృశ్యాలు జుగుప్సాకరంగా ఉంటాయి. ఐనా వేలాదిమంది ఎగబడి చూస్తుంటారు.

వెంటనే ముందు వరుసలో కూర్చొని ఉన్న ఒక ఆఫ్రికన్ కవయిత్రి ఆనందం పట్టలేక హఠాత్తుగా వేదిక పైకెక్కి నన్ను ఒడిసి పట్టుకొని నఖశిఖ పర్యంతం ముద్దులతో ముంచెత్తింది. అప్పుడు క్రింద నుండి ఒక కవయిత్రి భాష తెలియకుండానే ఎందుకు అంతగా పరవశించావని ఆమెను అడిగింది. అందుకు సమాధానంగా ఆవిడ భాష ఏదైతేనేం! వారి పొయిట్రీలోని శబ్ద సౌందర్యం నన్ను పులకింప చేసిందంటూ నన్ను మరీ మరీ అభినందించింది.

సభలు ముగిసిన నాటి రాత్రి "థాయిల్యాండు" ప్రభుత్వం "చావోప్రియ" నది మీద ఒక ఓడలో కవులందరికీ విందు ఏర్పాటు చేసింది. ఆ సందర్భంగా మనదేశంలో బహుళ ప్రచారంలో ఉన్న రామాయణాన్ని నృత్య రూపకంగా ప్రదర్శించారు. అక్కడ కూడా మన "రామకథ" గజ్జకట్టి నర్తించినందుకు నేను మరింత సంతోషించాను. దాంతో మహాసభల కార్యక్రమం పూర్తయింది. మర్నాడు థాయిల్యాండులో అందమైన ప్రదేశాలన్నీ కన్నుల కరువు తీరా చూశాం. అలా మేం సందర్శించిన వాటిలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన "ఎమరాల్డ్ బౌద్ధాలయం" ప్రత్యేకంగా చెప్పుకోదగినది. ఆ ఆలయ శోభ సందర్శకులను కట్టిపడేస్తుంది.

బ్యాంకాక్‌లో వ్యభిచారం చట్టబద్ధం. దానికొక ప్రత్యేక ప్రాంగణముంది. ఒకరోజు సాయంత్రం అందరం అక్కడికి వెళ్ళాం. అక్కడ ప్రదర్శించే నగ్న దృశ్యాలు జుగుప్సాకరంగా ఉంటాయి. ఐనా వేలాదిమంది ఎగబడి చూస్తుంటారు. నేను అక్కడ నిలవలేక అందరికంటే ముందుగా హోటల్ చేరాను. తర్వాత బ్యాంకాక్ ముచ్చట్లు నెమరువేసుకొంటూ అందరం ఇండియా చేరాం.

## ప్రపంచ తెలుగు సమాఖ్యతో నా అనుబంధం

1992వ సంవత్సరం సెప్టెంబర్‌లో ప్రపంచ తెలుగు సమాఖ్య ఆవిర్భావం చెన్నపురిలో జరిగింది. డాక్టర్ వి.జంగ్ స్వామి నాయుడు సభాధ్యక్షుడుగా, యు.విశ్వేశ్వరరావు కన్వీనర్‌గా వ్యవహరించారు. బెజవాడ గోపాల్‌రెడ్డిగారు విశిష్ట అతిథిగా విచ్చేసి తెలుగు భాష ఔన్నత్యాన్ని బహుముఖాలుగా విశ్లేషించారు.

ప్రపంచంలోని తెలుగు వారందరికీ ఒక సమైక్య వేదిక ఉండాలని ఆ సభలో ఒక తీర్మానం చేశారు. పర్యవసానంగా సుమారు వెయ్యి మంది తెలుగువాళ్ళు సమాఖ్యలో శాశ్వత సభ్యులుగా చేరారు. అందులో నేనూ ఒకణ్ణి. తర్వాత 1993 జూలై మూడవ తేదీన ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుగారు అమెరికాలోని న్యూయార్క్ మహానగరంలో మరొకసారి సమాఖ్యకు శుభారంభం పలికి అభినందించారు.

1994వ సంవత్సరం తిరిగి చెన్నపురిలోనే వార్షికోత్సవాలు జరిగాయి. ఆ సభల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త వి.ఎల్.దత్‌గారు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. తర్వాత 1996లో సమాఖ్య వార్షికోత్సవాలు హైదరాబాద్‌లోని "లలిత కళా తోరణం"లో వైభవోపేతంగా జరిగాయి. అప్పుడు వి.ఎల్.దత్‌గారే అధ్యక్షులుగా ఉన్నారు. ఆ సందర్భంగా దత్‌గారి కోరిక మేరకు నేనీ క్రింది స్వాగత గీతం రాశాను.

*"పలుకుతోంది స్వాగతం ప్రపంచ తెలుగు సమాఖ్య*
*ప్రతి ఒకరికి అంజలించి సరిగమలను రంగరించి.. ॥పలుకు॥*
*విశ్వం నలుమూలలందు విరబూసిన తెలుగుదనం*
*ఒక్కచోట కొలువు దీరి దిక్కుల నలరించు వేళ! ॥పలుకు॥*
*మంచుకొండ లోవిలా... మరు మల్లెల తావిలా...*
*నింగి - నేల - ఉండుదాక నిలిచే కావ్యాలు రాసి...*
*ఇలా తలం అంతటిలో తెలుగు నుడికి వెలపెంచిన*
*మాననీయ కవుల కెల్ల మంగళ నీరాజన మిదే ॥పలుకు॥*
*ఆంధ్రభోజ కృష్ణదేవ రాయలు వాకొనిన యట్లు*
*దేశ భాషలందు లెస్స తెలుగన్నది సత్యం!*
*తెలుగు వెలుగు ముమ్మాటికి పులు గడిగిన ముత్యం!*
*ఆ వెలుగును ప్రస్తుతించి అందరికీ శిరసు వంచి ॥పలుకు॥*
*పైరగాలి తరగలా.... పచ్చిపాల నురగలా...*
*మలినమింత లేనిది... మన తెలుగు సంస్కృతి!*
*అదే వరం.... నిరంతరం తెలుగు జాతికి!*
*తేట తెలుగు సొబగు మనకు గర్వకారణం! అది...ఏ*
*నాటికైనా వాడిపోని లలిత కళాతోరణం.*

హైదరాబాద్ తర్వాత డి.వి.యస్.రాజు గారి నేతృత్వంలో ఢిల్లీలో జరిగిన మహా సభలకు కారణాంతరాల వల్ల నేను వెళ్ళలేకపోయాను. తదుపరి సమావేశాలు 2000 సంవత్సరంలో వైజాగ్‌లో జరిగాయి. అప్పుడుకూడా రాజుగారే అధ్యక్షులుగా వున్నారు. అక్కడ కూడా నేను రాసిన స్వాగత గీతాన్నే ఆలపిస్తూ బాలా కొండయ్య బృందం అద్భుతమైన నృత్యాభినయంతో అందరినీ ఆకట్టుకుంది. ప్రపంచ తెలుగు సమాఖ్య వార్షికోత్సవాలు ఎక్కడ జరిగినా అనేక అంశాల మీద చర్చాగోష్ఠులు నిర్వహించడం, మహిళా విభాగం ఆధ్వర్యంలో స్త్రీలెదుర్కొంటున్న సమస్యలను సాకల్యంగా చర్చించి పరిష్కారాలను సూచించడం, కవి సమ్మేళనాలు జరపడం ఆనవాయితీగా వస్తున్న అంశాలు.

2002వ సంవత్సరంలో సమాఖ్య మహాసభలు సింగపూర్‌లో జరిగాయి. ఆ సభల్లో శ్రీమతి వి.ఎల్.ఇందిరాదత్ గారిని సమాఖ్య అధ్యక్షురాలిగా బి.యస్.ఆర్.కృష్ణను కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. ఇందిరాదత్‌గారు వి.ఎల్.దత్‌గారి సతీమణి. తెలుగుభాష పట్ల, తెలుగు సంస్కృతి పట్ల, మహిళా సంక్షేమం పట్ల ప్రత్యేక అభిమానం గల విదుషీమణి. వినయము, వివేకము ఆమెకు సహజ లక్షణాలు.

మన దేశం నుండి ఒక్క నర్తకిని కూడా తీసుకొని పోకుండా సింగపూర్‌లోని తెలుగువాళ్ళే నా స్వాగతగీతాన్ని నృత్యరూపకంగా ప్రదర్శించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. తర్వాత అనేక అంశాల మీద చర్చలు జరిగాయి. నా అధ్యక్షతన గొప్ప కవి సమ్మేళనం జరిగింది. దేశ విదేశాల నుండి వచ్చిన సుమారు ముప్ఫై మంది కవులాసమ్మేళనంలో పాల్గొన్నారు. అధ్యక్షుడిగా నేను ప్రతి కవినీ ఉత్తేజపరుస్తూ అందరికీ అవకాశం కల్పించాను.

అలా మూడురోజులు కార్యక్రమాలు విజయవంతంగా సాగాయి. చివరిరోజు నా ప్రసంగం విన్న యూరోపియన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షురాలు 'భారతి చావరాల'గారు, ఆమె భర్త బాబూరావుగారు మరుసటి సంవత్సరం లండన్ సమీపంలోని బర్మింగ్‌హామ్‌లో జరిగే ఈటా సభలకు నన్ను ముఖ్యఅతిథిగా రమ్మని కోరారు. నేను వారి ఆహ్వానాన్ని అంగీకరించాను.

(ఇంకా వుంది)

PDF Compressor Free Version



అమెరికా తెలుగు ఉత్సవాలలో

# నెల్లూరీయుల హవా

నెల్లూరీయులు ప్రపంచంలో ఏ మూలవున్నా తమ సత్తాను చాటుతూనే వుంటారు. నెల్లూరు కీర్తిని నలుచెరగులా వ్యాపింపచేస్తుంటారు. ప్రస్తుతం అమెరికాలో తెలుగువారు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న 'ఆటా', 'నాటా' వేడుకలలో సైతం నెల్లూరీయులు తమ హవాను చాటారు. నార్త్ అమెరికా హోస్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో జూన్ 29వ తేదీ రాత్రి జరగనున్న 'నాటా' వేడుకల్లో అవార్డులనందుకోనున్న వారిలో ముగ్గురు నెల్లూరీయులుండడం విశేషం.



మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి



శ్రీమతి శ్యామారెడ్డి



తుంగా శివప్రభాత్‌రెడ్డి

నెల్లూరీయులైన మలిరెడ్డి దంపతులు శ్రీనివాసులురెడ్డి, శ్రీమతి శ్యామారెడ్డిలకు 'నాటా' వేదికపై బిజినెస్ అండ్ ఫుడ్ టెక్నాలజీ రంగాలలో వారు చేసిన కృషిని గుర్తించి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులతో సన్మానించనుంది. మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి యుఎస్‌ఏ బెస్ట్ అమెరికన్ డెయిరీ అండ్ ఫుడ్ కన్సల్టింగ్ లేబొరేటరీస్‌కు ఛైర్మన్‌గా వున్నారు. వీరు ఎన్నో శాస్త్రీయ రచనలు చేశారు. ఎన్నో పురస్కారాలు కూడా పొందారు. 2012లో నోబెల్ పీస్ ప్రైజ్‌కు నామినేట్ అవటం నెల్లూరుకు గర్వకారణం.

శ్రీమతి శ్యామారెడ్డి నెల్లూరీయురాలే. 12సంవత్సరాలు 'ఆటా'లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా సేవలందించారు. అమెరికాలోని దాదాపు 10రాష్ట్రాలలో "రెడ్డి ప్రాపర్టీస్" పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. రెడ్డి ప్రాపర్టీస్‌కు శ్యామారెడ్డి ఛైర్మన్ అండ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. "అమెరికన్ డెయిరీ అండ్ ఫుడ్ కన్సల్టింగ్ లాబొరేటరీస్"కు ఈవిడ వైస్ ప్రెసిడెంట్ మరియు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. శ్రీమతి శ్యామారెడ్డి, నేషనల్ ఇంటర్నేషనల్ బిజినెస్ అవార్డులను చాలానే అందుకొని వున్నారు. ప్రస్తుతం 'నాటా'లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. శుక్ర వారం హిల్టన్ హోటల్‌లో 'నాటా' ప్రతిష్టాత్మకమైన లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ ఇన్ బిజినెస్ అండ్ టెక్నాలజీ అవార్డును అందుకోనున్నారు.

32సంవత్సరాల పాటు నెల్లూరుజిల్లా స్థానిక తెలుగు పత్రికా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకొని సమాజానికి సేవలందిస్తున్న "లాయర్" జాతీయ వారపత్రిక కృషిని గుర్తించి 'ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం అండ్ కమ్యూనిటీ సర్వీసెస్" అవార్డును పత్రిక సంగ్రాహకునిగా తుంగా శివప్రభాత్‌రెడ్డి అందుకోనున్నారు. సమాజసేవకులు, రైతుబిడ్డ మరియు "లాయర్" జాతీయవారపత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి కుమారుడు శివప్రభాత్‌రెడ్డి(ప్రభు). తన సారథ్యంలో ఇంటర్నెట్ ఎడిషన్‌ను ప్రారంభించి ప్రతి వారం లక్ష హిట్‌లతో ప్రపంచవ్యాప్తంగా "లాయర్" ఇంటర్నెట్ ఎడిషన్‌కు అభిమానులుండేలా చేయడం మరో విశేషం. దాదాపు 27సంవత్సరాలుగా పత్రికారంగంలో తన సేవలందిస్తుండడం గమనార్హం. గతంలో నెల్లూరుజిల్లాలో ఎయిడ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌కు జిల్లా కన్వీనర్‌గా సైతం ఆయన సేవలందించారు. నెల్లూరు నగరం రాజీవ్‌గాంధీ మార్గ్‌లో తిరుమల వెంకన్నపై వేలాది కీర్తనలు తెలుగులో రచించిన పదకవితా పితామహులు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహాన్ని శ్రీ చినజియ్యర్ స్వామి చేతుల మీదుగా ఆవిష్కరింపజేసి నెల్లూరు ప్రజలకు అంకితమిచ్చిన కమిటీకి చీఫ్ కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించడమే కాకుండా పలు సందర్భాలలో తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహించబడిన శ్రీనివాస కల్యాణం, ఊంజల్‌సేవ, పుష్పయాగం వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఈయన సారథ్యం వహించారు. పత్రికారంగంతో పాటు వివిధ రంగాలలో ప్రభు అందించిన సేవలకు గుర్తుగా 'నాటా' ఈ పురస్కారాన్ని అందించనుంది. నెల్లూరీయులు ఇంతటి పురస్కారాలను అందుకోవటం గర్వించదగ్గ విషయం. వీరికి అభినందనలు.

## కర్కశ కత్తికి బలైన కరస్పాండెంట్

నెల్లూరుజిల్లాలో వుండే ప్రశాంత వాతావరణాన్ని చెదిరిపోయేలా చేస్తున్నాయి కావలిలో తరచూ జరుగుతున్న హత్యాకాండలు. ఈనెల 26న కావలిలోని గీతాంజలి స్కూలు కరస్పాండెంట్ మేకల యానాదిరెడ్డి దారుణ హత్యకు గురయ్యాడు. ఒకప్పుడు అతనివద్ద కార్ డ్రైవర్‌గా పనిచేసిన రియాజే ఈ హత్యకు పాల్పడ్డాడు. కావలి కో–ఆపరేటివ్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో యానాదిరెడ్డి కుటుంబం నివసిస్తోంది. 26వ తేదీ రియాజ్ ఇక్కడు వచ్చి అద్దెకు ఇల్లు కావాలని అడుగుతూ 2వ ఫ్లోర్‌లోని యానాదిరెడ్డి ఇంటి కాలింగ్ బెల్‌ను అదే పనిగా కొట్టసాగాడు. దీంతో భయపడ్డ యానాదిరెడ్డి కుమార్తె సాయి అనూజ పాఠశాలలో వున్న తండ్రికి ఫోన్ చేసింది. యానాదిరెడ్డి వెంటనే ఇంటికి వచ్చి బయటవున్న రియాజ్‌ను ఇక్కడ నుండి వెళ్లిపోకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో రియాజ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో యానాదిరెడ్డి మెడ మీద నరికి చంపాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసారు.

## సేవలు సశేషం

(మొదటి పేజీ తరువాయి)

పవరుందో రాజకీయనాయకుల వద్ద డాలర్ శేషాద్రికి అంత పవరుంది. తిరుమలలో శాశ్వతంగా నిలబడిపోవడానికి ఆయన ఆ పవర్‌ను ఉపయోగించుకుంటున్నాడు. భగవంతుడికి, భక్తుడికి అంటికా దర్బార్ బత్తి అనుసంధానమైనట్లు ఆ వెంకటాద్రికి, ఈ శేషాద్రికి మధ్య పరపతి, పలుకుబడి అనుసంధానంగా మారాయి.






# తృతీయ వర్ధంతి



జననం :
07-02-1951

మరణం :
06-07-2009



మమతల మణిదీపం,
మా మనసుల్లో చెదరని రూపం

**స్వర్గీయ జక్కా సౌదామిని గారు**

శివ సాన్నిధ్యం పొంది
మూడేళ్ళు గడుస్తున్న సందర్భంగా...

ఆ పుణ్యమూర్తి దివ్యస్మృతిని స్మరిస్తూ...

తేది. 03-07-12(గురుపూర్ణిమ), మంగళవారము
మనుబోలులోని పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద
ఉదయం 11గంటల నుండి
సంస్మరణ కార్యక్రమం జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

**జె.ఎస్.రెడ్డి** (భర్త)
మరియు
**కుటుంబసభ్యులు**

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**.